తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
15-05-2026
శుక్రవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 101
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
**విలేకరులు కావలెను**
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు
స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# కాంగ్రెస్‌లో కమలం గుబులు..




**రేవంత్‌తో మోదీ కెమిస్ట్రీపై తెలంగాణలో పొలిటికల్ హీట్**

**ప్రధాని వ్యాఖ్యలతో హస్తం పార్టీలో కలకలం**

**రేవంత్‌బీజేపీ బంధంపై బీఆర్ఎస్ ఫెవికాల్ సెటైర్లు**

**సీఎం సేఫ్ జోన్ గేమ్ ఆడుతున్నాడా? అన్న రాజకీయ చర్చ**

**అస్సాం, బెంగాల్ ఫార్ములానే తెలంగాణలోనూ అమలు చేస్తారా?**

**ఒక్క వేదికపై నవ్వులు.. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అనుమానాలు**

**హైదరాబాద్:** మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి హైదరాబాద్ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రదర్శించిన రాజకీయ శైలి తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చలకు తెరలేపింది. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ వేదికపై సీఎం రేవంత్ రెడ్డితో మోదీ సరదా సంభాషణలు, నవ్వులు, పరస్పర అనుబంధం కేవలం ప్రోటోకాల్ పరిమితి కాదనే విశ్లేషణలు జోరందుకున్నాయి. ముఖ్యంగా "గుజరాత్‌కు మించిన అభివృద్ధి కావాలంటే మాతో చేతులు కలపాలి" అన్న మోదీ వ్యాఖ్య, దానికి రేవంత్ నవ్వుతూ స్పందించిన తీరు తెలంగాణ కాంగ్రెస్‌లో గుబులు రేపుతుండగా, బీజేపీ వ్యూహాలపై

మిగతా 2వ పేజీలో..





# సింగరేణిలో మహిళా శక్తి

## డంపర్ ఆపరేటర్లుగా నియామకానికి సన్నాహాలు

- హెచ్‌ఎంవీ శిక్షణను పూర్తి చేసిన 13మంది
- 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారి అవకాశం

**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్:** మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తిని ప్రోత్సహించాలని ఆదేశించడంతో సంస్థ చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఓపెన్ కాస్ట్ (ఓసీ) గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్‌ను గని క్వారీ నుండి ఉపరితలానికి

మిగతా 2వ పేజీలో..




## మరోమారు తెరపైకి ఫార్ములా ఈ-రేస్ కేసు

- కేటీఆర్ తదితరులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు
- జూలై 31న విచారణకు రావాలని ఆదేశాలు

2



## విద్య ఎవరి సొత్తు కాదు

- తెలంగాణ రైజింగ్‌లో ప్రతీ విద్యార్థి భాగం కావాలి
- క్రీడలు, యువజన సంక్షేమ శాఖ మంత్రి వాకిటి

3

# యువత భవిష్యత్తుతో చెలగాటమా?



- నీట్ రద్దుపై రేవంత్ ఫైర్..
- మోడీ సర్కార్ నిర్ణయం నిరంకుశ చర్య అంటూ సీఎం ఆగ్రహం
- రెండు కోట్ల మంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకమైందన్న ఆరోపణ
- పరీక్షల వైఫల్యాలపై కేంద్ర మంత్రులపై చర్యలేదని విమర్శ
- తెలంగాణ విద్యార్థులకు అండగా ఉంటామని రాష్ట్ర ప్రభుత్వం భరోసా

3

## కేరళ సీఎం అభ్యర్థి సతీశన్‌కు రేవంత్ అభినందనలు

03

- ఆయనకు పదవి దక్కడం సముచిత గుర్తింపు అని వెల్లడి

## ఇంధన పొదుపుపై తెలంగాణ సర్కార్ దృష్టి

- సీఎం, మంత్రుల కాన్వాయ్‌ల తగ్గింపుపై కసరత్తు

3





## ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- భగీరథకు మధ్యంతర బెయిల్‌పై నేడు హైకోర్టు నిర్ణయం

2

## ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

2

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



- రబీలో 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- 90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధం
- దిగుబడి, కొనుగోలులో ఆల్ టైం రికార్డ్
- ధాన్యం కొనుగోలుకు రూ.22,000 కోట్ల కేటాయింపు
- రైతాంగాన్ని మోసం చేస్తే కఠిన చర్యలు
- అందుబాటులో ఉన్న వాహనాలన్నీ వినియోగించాలి
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3



## శిక్షణ, పాఠ్యాంశాల్లో ఆధునికత ఉండాలి

- గ్రేహౌండ్స్ ఆపరేషన్స్‌పై డీజీపీ ఆనంద్ సమీక్ష
- ప్రభుత్వ పరిశీలనలో పోస్టుల 708 సరెండర్ ప్రతిపాదన

2



## ఉగ్ర ముప్పుపై తెలంగాణ అప్రమత్తం..
## ఆక్టోపస్ యాక్షన్ ప్లాన్..!

**ఇబ్రహీంపట్నం ఆక్టోపస్ ట్రైనింగ్ సెంటర్‌లో డీజీపీ పర్యటన**

**స్వాట్ టీమ్స్ శిక్షణ, మాక్ డ్రిల్స్‌పై ప్రత్యేక సమీక్ష**

**కమాండోలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశం**

**భవిష్యత్ ఎయిర్‌పోర్ట్ భద్రతపై వ్యూహాలు సిద్ధం**

**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్:** తెలంగాణ రాష్ట్ర కౌంటర్ టెర్రర్ ఫోర్స్ 'ఆక్టోపస్' (OCTOPUS) పనితీరు, శిక్షణ కార్యకలాపాలు , ఆపరేషనల్ సన్నద్ధతను రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (DGP) శ్రీ సీవీ ఆనంద్ గురువారం క్షుణ్ణంగా సమీక్షించారు. ఇబ్రహీంపట్నం లోని ఆక్టోపస్

మిగతా 2వ పేజీలో..

# సుబోధ్ సింగ్ గ్యాంగ్ పనే..

- కరీంనగర్ జ్యువెలరీ దోపిడీ మిస్టరీ వీడింది!
- కరీంనగర్ జ్యువెలరీ దోపిడీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్
- ప్రధాన సూత్రధారి సుబోధ్ సింగ్ బీహార్ జైలు నుంచే పథకం రచించినట్లు వెల్లడి
- మొత్తం 13 మంది నిందితులను గుర్తించిన పోలీసులు
- బెంగాల్, బీహార్‌లలో నిందితులను పట్టుకున్న ప్రత్యేక బృందాలు
- మిగిలిన వారి కోసం వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న గాలింపు

**కరీంనగర్, మే 14 సిరిన్యూస్:** కరీంనగర్ పట్టణంలో సంచలనం రేపిన పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కమిషనర్ గౌస్ ఆలం వెల్లడించారు. కేసులో మొత్తం 13 మంది నిందితులను గుర్తించామని, పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలు

మిగతా 3వ పేజీలో..






## పదవీ బాధ్యతలు స్వీకరించిన వీహెచ్

**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(బీసీ సంక్షేమం)గా ఇటీవల నియమితులైన వి. హనుమంతరావు(వీహెచ్) డాక్టరు బి.ఆర్. అంబేడ్కర్ సచివాలయంలో గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పలురు పార్టీ నేతలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాంగ్రెస్‌లో కమలం గుబులు..

**మొదటిపేజీ తరువాయి**

కొత్త అనుమానాలకు దారితీసింది.
తెలంగాణ రాజకీయాల్లో మాస్ ఇమేజ్ కలిగిన నేతగా రేవంత్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారు. బీఆర్ఎస్ వంటి బలమైన శక్తిని ఢీకొట్టి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు వచ్చిన ఆయనపై కమలం పార్టీ వ్యూహాత్మకంగా దృష్టి పెట్టిందా? అన్న ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. రాష్ట్రంలో బీజేపీకి బలమైన సామూహిక మద్దతు కలిగిన స్థానిక నాయకత్వం లోపిస్తున్న వేళ, ప్రత్యర్థి పార్టీలో ఉన్న ప్రజాదరణ గల నేతలపై సాఫ్ట్ కార్నర్ చూపించడం రాజకీయ పెట్టుబడిగా మారవచ్చన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.
బీజేపీ గతంలో అస్సాం, వెస్ట్ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో అనుసరించిన రాజకీయ సమీకరణాలను తెలంగాణలోనూ ప్రయోగించవచ్చన్న సందేహాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్‌లో అంతర్గత గ్రూపు రాజకీయాలు, వర్గ పోరు, నాయకత్వ పోటీలు ఎప్పటికప్పుడు చర్చకు వస్తున్న నేపథ్యంలో.. రేవంత్‌పై మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపడం వెనుక భవిష్యత్ రాజకీయ లెక్కలు ఉన్నాయా? అనే చర్చ సాగుతోంది.
ఇక బీఆర్ఎస్ మాత్రం ఈ పరిణామాన్ని అవకాశంగా మలుచుకుంటూ కాంగ్రెస్ బీజేపీ మధ్య "ఫెవికాల్ బంధం" అంటూ సెటైర్లు విసురుతోంది. రేవంత్ బీజేపీతో సాన్నిహిత్యం పెంచుకుంటున్నారనే ప్రచారాన్ని బలపరచాలని చూస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్‌లోని వ్యతిరేక వర్గాలు కూడా ఈ పరిణామాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి రాజకీయ ఒత్తిడి పెంచే అవకాశాలపై చర్చ జరుగుతోంది.
రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి కాంగ్రెస్‌ను వీడే అవకాశాలు కనిపించకపోయినా, భవిష్యత్ రాజకీయ సమీకరణాల్లో తనకు ప్రత్యామ్నాయ మార్గాలు తెరిచి ఉంచుకునే సేఫ్ గేమ్ ఆడుతున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. సీఎం పదవిలో ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగినా, అంతర్గత విభేదాలు పెరిగితే రాజకీయ భవిష్యత్తు కోసం బీజేపీ ఒక ఆప్షన్‌గా మారుతుందా? అన్న సందేహాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.మొత్తానికి హైదరాబాద్ వేదికపై మోదీరేవంత్ నవ్వులు కేవలం మర్యాదపూర్వక సంభాషణలా? లేక తెలంగాణలో భవిష్యత్ రాజకీయాలకు సంకేతమా? అన్న ప్రశ్నకు సమాధానం రానున్న రోజుల్లో తేలనుంది. అయితే ఒక్క వేదికపై ప్రధాని ప్రదర్శించిన సాన్నిహిత్యం.. కమలానికి ఊపు, కాంగ్రెస్‌కు గుబులు, బీఆర్ఎస్‌కు విమర్శా ఆయుధం అందించిందనేది మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

# సింగరేణిలో మహిళా శక్తి
# డంపర్ ఆపరేటర్లుగా నియామకానికి సన్నాహాలు

**మొదటిపేజీ తరువాయి**




రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి 100 టన్నుల సామర్థ్యం గల భారీ డంపర్లను వినియోగిస్తున్నది. సింగరేణిలో యాభయ్యేళ్లుగా నిర్వహిస్తున్న ఓసీల్లో ఇప్పటివరకు పురుష ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్‌లను నడుపుతూ వస్తున్నారు. ఎందుకంటే ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతోపాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరం. పైగా మండే ఎండలు, భారీ వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకుని మూడు షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుంది. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నది. మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని, వారి నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించడానికి తగు ప్రాధాన్యత కల్పించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కలు సింగరేణిని ఆదేశించారు. ఈ క్రమంలో సింగరేణి సంస్థ ఓసీల్లో డంపర్ ఆపరేటర్లుగా పనిచేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులు కోరింది. మొదట దాదాపు 35 మంది ముందుకు వచ్చారు. భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకుముందే ఉన్న సాధారణ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్) అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాల డ్రైవింగ్ శిక్షణను అందించింది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి తెలిపారు. వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నోటిఫికేషన్‌లో అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠినమైన పనుల్లో 13 దశాబ్దాల సింగరేణి సంస్థ చరిత్రలో తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు కూడా అవకాశం కల్పించేందుకు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది.

**తాము కూడా చేయగలమన్న ఆత్మవిశ్వాసం కలిగింది**

ఈ సందర్భంగా కొందరు మహిళా ఆపరేటర్లు మాట్లాడుతూ భారీ డంపర్లను నడపడం శారీరక కష్టం, నైపుణ్యంతో కూడుకున్న పని అని, తాము చేయగలమో లేదో అని కొంత భయపడినప్పటికీ స్వయంగా డంపర్లు నడుపుతున్నప్పుడు తాము కూడా ఇలాంటి పనులు చేయగమన్న ఆత్మవిశ్వాసం కలగిందన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలతోపాటు రోదసిలోకి వెళ్తున్నారని, గనిలోని డంపర్లను మహిళలు నడపడం అంత కష్టమేమీ కాదని, ఇలాంటి మంచి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి తాము ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. అధికారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల ఆదేశాల మేరకు సింగరేణిలో మహిళా శక్తికి తగిన అవకాశాలు కల్పిస్తూ వస్తున్నామని, బెల్లంపల్లి ఖైరీగూడ ఓపెన్ కాస్ట్ గనిలో అత్యంత క్లిష్టమైన బ్లాస్టింగ్ విభాగంలో కూడా మహిళలను నియమించగా వారు పురుష ఉద్యోగులతో సమానంగా బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారని, అలాగే ఇతర విభాగాల్లో కూడా వారు రాణిస్తున్నారని పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో తొలిసారిగా మహిళా రెస్క్యూ జట్టును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇకపై కూడా వివిధ క్లిష్టతరమైన ఉద్యోగాలలో ఆసక్తి గల మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

## ఉగ్ర ముప్పుపై తెలంగాణ అప్రమత్తం..
# ఆక్టోపస్ యాక్షన్ ప్లాన్..!

**మొదటిపేజీ తరువాయి**

కమాండో శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, క్యాంపస్‌లోని అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, శిక్షణ విభాగం , ఆపరేషనల్ సౌకర్యాలతో పాటు కొత్తగా అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమాండోలు, అధికారులతో ముఖాముఖి మాట్లాడి, ఏవైనా అవాంఛనీయ ఉగ్రవాద సంఘటనలు ఎదురైతే వాటిని తిప్పికొట్టేందుకు ఫోర్స్ ఎంతవరకు సిద్ధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (SWAT) బృందాల పనితీరును , శిక్షణ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆపరేషన్స్ విభాగం డీజీ డాక్టర్ అనిల్ కుమార్ ఈ సందర్భంగా డీజీపీకి పలు అంశాలపై వివరణ ఇస్తూ, ఆపరేషనల్ టీమ్స్ నిర్వహిస్తున్న రెగ్యులర్ కార్యకలాపాలను వివరించారు. కీలక సంస్థలు, సున్నిత ప్రాంతాల్లో కాలానుగుణంగా చేపడుతున్న మాక్ ఎక్సర్‌సైజులు, ఉగ్రవాద వ్యతిరేక పోరాట విన్యాసాలు , అత్యాధునిక ఆయుధాల వినియోగంలో కమాండోలకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ గురించి ఆయన పేర్కొన్నారు. కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి వివిధ రకాల భవన సముదాయాలు, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే రీతిలో మాక్ ఆపరేషన్లు నిర్వహించడం అత్యంత కీలకమని డీజీపీ సీవీ ఆనంద్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.
కమాండోలు శారీరక దృఢత్వంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని, ఎల్లప్పుడూ నిశితమైన అప్రమత్తతతో ఉంటూ 24 గంటలూ విధులకు సిద్ధంగా ఉండాలని డీజీపీ సూచించారు. అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన అత్యాధునిక పరికరాల సేకరణ , మౌలిక సదుపాయాల బలోపేతంపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న విమానాశ్రయాలతో పాటు భవిష్యత్తులో రాబోయే విమానాశ్రయాల భద్రతను దృష్టిలో ఉంచుకుని కార్యకలాపాల వ్యూహాలను పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రేహౌండ్స్ , ఆక్టోపస్ దళాలు తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, వాటి వృత్తి నైపుణ్యం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన కొనియాడారు. ఈ దళాల సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం , పోలీస్ శాఖ నుంచి పూర్తి స్థాయి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం. వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ సీహెచ్. రఘునందన్ , ఇతర ఆక్టోపస్ అధికారులు పాల్గొన్నారు.

## శిక్షణ, పాఠ్యాంశాల్లో
# ఆధునికత ఉండాలి

**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్:**

ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా గ్రేహౌండ్స్ సిబ్బందికి అందిస్తున్న శిక్షణ ప్రమాణాలు, పాఠ్యాంశాలు, మాడ్యూల్స్‌లో నిరంతరం ఆధునికత ఉండాలని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీస్ శాఖలో ప్రధానమైన గ్రేహౌండ్స్ కార్యకలాపాలపై ఆయన గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన డీజీపీ¾ గ్రేహౌండ్స్ నిర్వహిస్తున్న వివిధ ఆపరేషన్లు, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించారు. మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో గ్రేహౌండ్స్ ప్రదర్శిస్తున్న తీరును, వారికి అప్పగించిన ఇతర బాధ్యతల నిర్వహణను ఈ సందర్భంగా డీజీపీకి అధికారులు వివరించారు. కార్యకలాపాల సామర్థ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా అత్యున్నతస్థాయి పోరాట పటిమను చాటాలని అధికారులను ఆదేశించారు.
క్షేత్రస్థాయిలో సిబ్బందికి క్రమం తప్పకుండా ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించాలని, కఠినమైన శిక్షణ ద్వారా బలగాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గ్రేహౌండ్స్ బలాన్ని తగ్గించే అంశంపై కూడా డీజీపీ సుదీర్ఘంగా చర్చించారు. గ్రేహౌండ్స్‌కు సంబంధించి 708 సరెండర్డ్ పోస్టుల ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని అధికారులకు వివరించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి తగిన ఉత్తర్వులు అందిన తర్వాతే సిబ్బందిని తిరిగి మాతృ విభాగాలకు పంపే ప్రక్రియను చేపడతామని స్పష్టం చేశారు. గ్రేహౌండ్స్ సిబ్బంది కనబరుస్తున్న అంకితభావం, వృత్తి నైపుణ్యాన్ని ఈ సందర్భంగా డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు. దేశంలోనే అత్యుత్తమ మావోయిస్టు వ్యతిరేక దళాల్లో ఒకటిగా గ్రేహౌండ్స్‌కు ఉన్న పేరును కాపాడాలని, క్రమశిక్షణ, ముందస్తు సన్నద్ధతతో తమ ప్రత్యేకతను చాటుకోవాలని సూచించారు. డీజీ ఆపరేషన్స్ (గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్) డాక్టర్ అనిల్ కుమార్, గ్రూప్ కమాండర్ రాఘవేందర్ రెడ్డి, గ్రేహౌండ్స్ అధికారులు సమీక్షా సమావేశానికి హాజరయ్యారు.



# ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్:**



పోక్సో కేసులో నిందితుడైన బండి సాయి భగీరథ్ దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిన్‌పై విచారణను హైకోర్టు వెకేషన్ బెంచ్ వారం రోజులకు వాయిదా వేసింది. అతని తరపు న్యాయవాది కృష్ణకాంత్ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ముందస్తు, మధ్యంతర బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో గురువారం సుదీర్ఘ విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం మధ్యంతర బెయిల్‌పై నిర్ణయాన్ని శుక్రవారానికి వాయిదా వేయగా ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వారం రోజులపాటు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక అంశాలను లేవనెత్తారు. కరీంనగర్‌లో బాధితురాలిపై తప్పుడు కేసు నమోదు చేశారని కోర్టుకు తెలిపారు. బాధితురాలి తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో కరీంనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేశారని వివరించారు. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో ఈ కేసులో సాక్ష్యాధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని పీపీ వాదించారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడని పదేపదే చెప్పాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. భగీరథ్ తరఫున అడ్వకేట్ కృష్ణకాంత్ తన వాదనలు వినిపిస్తూ ఈ కేసులో భగీరథ్‌పై 'పోక్సో' చట్టం వర్తించదని, ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించామని తెలిపారు. యువతి మైనర్ అనే నెపంతో విచారణకు వెళ్లే సమయంలో భగీరథ్‌ను అరెస్టు చేసే అవకాశం ఉందని, అందుకే బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. 'బండి సంజయ్ కుమారుడు కావడంతోనే నిరాధారంగా పోక్సో చట్టాన్ని ప్రయోగించారు.. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పొలిటికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు.. నిందితుడిని సామాన్యుడిలాగే పరిగణించి న్యాయం చేయాలి' అని ఆయన కోరారు. తమ వాదనలు వినిపించడానికి సమయం కావాలని బాధితురాలి తరపు న్యాయవాది కోరడంతో మధ్యంతర బెయిల్‌పై శుక్రవారం తుది నిర్ణయం తీసుకుంటామని కోర్టు వెల్లడించింది. కాగా, ముందస్తు బెయిల్ రావడానికి వారం సమయం పట్టేలా ఉండటంతో ఆ లోపు అరెస్టు కాకుండా ఉండేందుకు భగీరథ్ న్యాయవాది మధ్యంతర బెయిల్ కోరారు. దీనిపై కోర్టు శుక్రవారం ఇచ్చే ఆదేశాలు కీలకం కానున్నాయి. బాలికపై లైంగిక దాడి, ఇతర నేరారోపణల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. బండి సాయి భగీరథ్ కోసం గాలింపు చర్యలు మొదలుపెట్టిన పేట్ బషీరాబాద్ పోలీసులు మంగళవారం కరీంనగర్‌కు వెళ్లి విచారణ నిమిత్తం భగీరథ్‌ను వెంట తీసుకుని బుధవారం మధ్యాహ్నం 2గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని అతడి మేనమామ వంశీకృష్ణకు నోటీసులు అందజేశారు. అయితే బుధవారం మధ్యాహ్నం నిందితుడు విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాలతో తాను ఈ రోజు విచారణకు హాజరుకాలేకపోతున్నానని, పూర్తి ఆధారాలతో ఈ నెల 15న హాజరై పోలీసులకు సహకరిస్తానని, రెండు రోజుల గడువు ఇవ్వాలంటూ పోలీసులకు పంపిన ఈ`మెయిల్‌లో పేర్కొన్నాడు. ఇప్పుడు బెయిల్ పిటిషన్‌పై కోర్టు విచారణ వాయిదా వేయడంతో 15న విచారణకు హాజరవుతాడా లేదా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

## కేటీఆర్‌తో ఆస్ట్రేలియా
# హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ భేటీ

**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్:**

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో దేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ గురువారం సమావేశమయ్యారు. నందినగర్‌లో జరిగిన ఈ భేటీలో పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ప్రస్తావించారు. గతంలో పరిశ్రమలు , ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవమున్న కేటీఆర్ ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై తెలంగాణఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఈ చర్చలు సాగాయి. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఈ భాగస్వామ్యం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# మరోమారు తెరపైకి ఫార్ములా ఈ-రేస్ కేసు


**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్:**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా`ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31న విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. కేటీఆర్‌తో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్, ఏ3 హెచఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎలఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్‌సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ`కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎలఎన్ రెడ్డిలు సహా ఎఫఈఓ సంస్థ ప్రతినిధులను ఏసీబీ ప్రశ్నించింది. దీని నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి.

# ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

- **ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్ పరీక్షలు**
- **మార్పులకు సిద్ధం అవుతున్న బోర్డు**

**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్:**




ఇంటర్ విద్యా విధానంలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కీలక మార్పులు చేపట్టేందుకు సిద్ధమైంది. 202627 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసింది. కొత్త విధానంలో సైన్స్, మ్యాథ్స్, భాషా విభాగాల్లో పరీక్షల సరళి, మార్కుల విధానం, ప్రాక్టికల్స్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహించగా, కొత్త విధానంలో ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టనున్నారు. ప్రత్యేకంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కొత్త విధానం ప్రకారం.. ఇంటర్ ఫస్టియర్‌లో, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనుంది. దీంతో విద్యార్థులు కేవలం థియరీకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. మ్యాథమేటిక్స్ బోధనలోనూ కీలక మార్పులు తీసుకురానుంది. సంప్రదాయ పద్ధతికి బదులుగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేయనుంది. దీంతో విద్యార్థులు సూత్రాలను అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యనభ్యసించడం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులకు గ□నైల్ పరీక్ష నిర్వహిస్తుండగా, కొత్త విధానంలో దాన్ని 60 మార్కులకు తగ్గించనుంది. అదేవిధంగా యాక్టివిటీలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ప్రాధాన్యం పెంచే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఇంటర్ పరీక్షలు 100 మార్కులకు నిర్వహించగా, ఇకపై వాటిని 80 మార్కులకు నిర్వహించనున్నట్లు సమాచారం. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ద్వారా కేటాయించే అవకాశం ఉంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ వంటి భాషా విభాగాల్లో 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించనుంది. ఇందులో ప్రాజెక్టులు సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్‌రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గే అవకాశం ఉందని విద్యా నిపుణులు భావిస్తున్నారు. ఒక్క గ□నైల్ పరీక్ష ఆధారంగా కాకుండా, ఏడాది పొడవునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి రానుంది. ఈ సంస్కరణలు జాతీయ విద్యా విధానం(ఔఇఖ)కు అనుగుణంగా తీసుకువస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా విద్యా నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటర్ విద్యా విధానంలో వస్తున్న ఈ మార్పులు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# కేరళ సీఎం అభ్యర్థి సతీశన్‌కు రేవంత్ అభినందనలు

**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్::**



కేరళ ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళ ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ... విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళ దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. కేరళ మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఇంధన పొదుపుపై తెలంగాణ సర్కార్ దృష్టి

**హైదరాబాద్, మే14 సిరిన్యూస్::**

ఇంధన వినియోగాన్ని తగ్గించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇంధన కొరత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వినియోగాన్ని నియంత్రించాలని ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల రాష్ట్రాలకు సూచించిన నేపథ్యంలో తెలంగాణ సీఎంవో కూడా చర్యలపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం హైదరాబాద్ నగర పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ పరిమిత వాహనాలతోనే సాగుతున్నట్లు సమాచారం. అత్యవసర భద్రతా అవసరాలు ఉన్న సందర్భాలను మినహాయించి రెండు నుంచి మూడు వాహనాలతోనే ప్రయాణాలు కొనసాగుతున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఈ విధానాన్ని మరింత విస్తరించే అంశంపై అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

సిటీ బయట పర్యటనల సమయంలో కూడా కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించే అవకాశాలపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం. సీఎం కాన్వాయ్‌తో పాటు మంత్రుల వాహన శ్రేణులపైనా ఇదే విధానాన్ని అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఢిల్లీలో ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో 60 శాతం వాహనాలను తగ్గించినట్లు సమాచారం. అలాగే అక్కడ ప్రభుత్వ ఉద్యోగులకు కొన్ని రోజుల పాటు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన కాన్వాయ్‌లో సగం వాహనాలను తగ్గించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. గురువారం నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# మీ సేవ ద్వారా మరో పోటీ పరీక్ష హాల్ టికెట్లు

- **వాట్సాప్ ద్వారా నే నుంచి డీఈఈ సెట్ హాల్ టికెట్లు**




**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్ :**

తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ) విభాగం, డీఈఈసెట్ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) హాల్ టికెట్లను మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్‌లో అందుబాటులోకి తీసుకు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది విద్యార్థులు ఈనెల 15న ఉదయం 10 గంటల నుంచి వాట్సాప్ ద్వారా తమ హాల్ టికెట్లను వెంటనే పొందవచ్చు. డీఈఈసెట్ పరీక్ష ఈ నెల 21, 22 తేదీల్లో జరగనుంది.

హాల్ టికెట్ పొందే విధానం

అధికారిక మీ సేవ వాట్సాప్ నంబర్ 8096958096ను మీ సేవ తెలంగాణ పేరుతో సేవ్ చేసుకోవాలి. వాట్సాప్ ఓపెన్ చేసి హాయ్ (Hi) అని మెసేజ్ పంపాలి. డీఈఈసెట్ హాల్ టికెట్ అని టైప్ చేయాలి. మెనూలో కనిపించే ఓపెన్ సర్వీస్ ఎంపికపై క్లిక్ చేయాలి. అవసరమైన వివరాలు నమోదు చేయాలి. పేమెంట్ ఐడీ, అప్లికేషన్ నంబర్, మొబైల్ నంబరు, డేట్ ఆఫ్ బర్త్ వివరాలు సమర్పించిన వెంటనే డీఈఈసెట్ హాల్ టికెట్ వాట్సాప్‌లో అందుతుంది.

ఈ సేవ ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు పరీక్షలకు సంబంధించిన సేవలు వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి వస్తాయి. రాష్ట్ర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకంగా, సులభమైన డిజిటల్ సేవలను అందించాలనే లక్ష్యంతో, ఐటీ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీ సేవ ద్వారా పౌర సేవలను మరింతగా విస్తరిస్తూ ముందుకు సాగుతోంది. గత ఏడాది నవంబరు 18న ప్రారంభమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన డిజిటల్ సేవల వేదిక అయిన మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ సేవల ద్వారా ప్రజలకు మరింత సులభంగా ప్రభుత్వ సేవలను అందిస్తోంది. మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ సేవలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే ఈ వేదిక అత్యంత వేగంగా ప్రజాదరణ పొందిన డిజిటల్ పౌర సేవా వేదికలలో ఒకటిగా నిలిచింది.

# భార్యతో గొడవ..
## నాటు తుపాకీతో కాల్చుకుని భర్త ఆత్మహత్య

**కామారెడ్డి, మే 14 సిరిన్యూస్:**

లింగంపేట మండలం మోతె గ్రామంలో దారుణ ఘటన వెలుగు చూసింది. నాటు తుపాకీతో కాల్చుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మోతె గ్రామానికి చెందిన ఇంద్రజిత్ సింగ్‌కి ఓ మహిళతో కొన్నేళ్ల కిందట వివాహం అయ్యింది. కొన్నాళ్లపాటు బాగానే సాగిన వారి కాపురంలో వివాదాలు మొదలయ్యాయి. దీంతో తరచూ గొడవలు పడుతూ ఉండేవారు. గురువారం కూడా వారి మధ్య మళ్లీ వివాదం చెలరేగింది. అయితే, ఈసారి వివాదం మాటలతో ముగిసిపోలేదు. తరచూ గొడవలతో విసిగిపోయిన ఇంద్రజిత్ సింగ్ కఠిన నిర్ణయం తీసుకున్నాడు. తన వద్ద ఉన్న నాటు తుపాకీ తీసుకుని భార్య ముందే కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ కొనసాగుతోందని తెలిపారు



# యువత భవిష్యత్తుతో చెలగాటమా?

**హైదరాబాద్ సిరిన్యూస్:**

నీట్ యూజీ 2026 రద్దు నిర్ణయంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ నిర్ణయాన్ని యువత భవిష్యత్తును దెబ్బతీసే ఏకపక్ష, నిర్లక్ష్య పూరిత చర్యగా అభివర్ణించిన ఆయన.. దేశవ్యాప్తంగా లక్షలాది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనలోకి నెట్టబడ్డాయని విమర్శించారు. కష్టపడి సంవత్సరాల పాటు సిద్ధమైన విద్యార్థుల కలలను కేంద్ర వైఫల్యం ఛిద్రము చేసిందని అన్నారు.

పరీక్షా వ్యవస్థలో వరుస పేపర్ లీక్‌లు, పరీక్షల రద్దులు దేశ విద్యా పరిపాలనలో తీవ్రమైన లోపాలను బహిర్గతం చేస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. గత దశాబ్దంలో అనేక కీలక పరీక్షలు లీకేజీలు, అవకతవకల కారణంగా వివాదాల్లో చిక్కుకున్నప్పటికీ బాధ్యులపై కఠిన చర్యలు కనిపించలేదని విమర్శించారు. పేపర్ లీక్ జరిగితే విద్యార్థులే మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారని.. కానీ పాలనా బాధ్యత వహించాల్సిన వ్యవస్థ మాత్రం తప్పించుకుంటోందని అన్నారు. నీట్ రద్దు ప్రభావం సాధారణ పరిపాలనా నిర్ణయం కాదని, ఇది దేశవ్యాప్తంగా విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీసే పరిణామమని రేవంత్ వ్యాఖ్యానించారు. పెద్ద నోట్ల రద్దు సమయంలో ప్రజలు ఎదుర్కొన్న అనిశ్చితి మాదిరిగానే, ఇప్పుడు విద్యార్థులు భవిష్యత్తుపై గందరగోళంలో పడిపోయారని పేర్కొన్నారు. తమ పిల్లల చదువు కోసం అప్పులు చేసిన కుటుంబాలు, నగలు అమ్ముకున్న తల్లిదండ్రుల ఆశలు ఒక్కసారిగా సంక్షోభంలో పడటం బాధాకరమన్నారు.

దేశంలో పరీక్షల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయని, అనేక రాష్ట్రాల్లో ప్రధాన నియామక, ప్రవేశ పరీక్షలు వరుసగా వివాదాలకు గురవుతున్నాయని సీఎం గుర్తుచేశారు. ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పలు పరీక్షల లీకేజీల ఆరోపణలు రావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. పరీక్షా వ్యవస్థను పారదర్శకంగా, నమ్మకంగా నిర్వహించాల్సిన కేంద్రం.. చట్టాలు తీసుకొచ్చినా అమలు విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిందని ఆరోపించారు.

విద్యార్థులు, తల్లిదండ్రులు భయపడవద్దని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థి పక్షాన నిలుస్తుందని, యువత భవిష్యత్తును కాపాడేందుకు అవసరమైన ప్రతి వేదికపై పోరాడుతామని స్పష్టం చేశారు. పరీక్షలు కేవలం ఉద్యోగాలు, ప్రవేశాల కోసం మాత్రమే కాకుండా కోట్లాది కుటుంబాల ఆశలతో ముడిపడి ఉంటాయని.. అలాంటి వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం దేశ భవిష్యత్తుతో ఆడుకోవడమేనని హెచ్చరించారు. మొత్తంగా, నీట్ యూజీ రద్దు అంశాన్ని రేవంత్ రెడ్డి కేవలం విద్యా సమస్యగా కాకుండా.. దేశ యువత ఆత్మవిశ్వాసం, అవకాశాలు, కుటుంబాల భవిష్యత్తును ప్రభావితం చేసే జాతీయ సంక్షోభంగా ప్రస్తావించడం రాజకీయంగానూ చర్చనీయాంశమైంది.

# విద్య ఎవరి సొత్తు కాదు

**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్::**

విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతాం అంటే విద్య వినయాన్ని ఇస్తుంది.. వినయం వ్యక్తిని గొప్పవాడిని చేస్తుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలి అని క్రీడలు, యువజన సంక్షేమ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. బంజారాహిల్స్ కొమురంభీం భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ బానిసత్వం నుంచి విద్య బయటకు తీసుకువస్తుందని నెల్సన్ మండేలా, మహాత్మా జ్యోతి రావు పూలేలు చెప్పారన్నారు. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నందున 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలని పిలుపునిచ్చారు. వంద సంవత్సరాలుగా చేయని కుల గణనను ప్రజా ప్రభుత్వం చేసిందని చెప్పారు. విద్యలో ఒత్తిడి ఉండొద్దని 25 వేల మంది టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చామని, అవకాశాన్ని సృష్టించుకున్నవాళ్లే సమర్థులు అవుతారని అన్నారు. తెలంగాణ రైజింగ్‌లో ప్రతీ విద్యార్థి భాగం కావాలన్నారు. సరస్వతి దేవికి రంగు, రూపు తేడా ఉండదు.. విద్యపై మనం చూపే ఏకాగ్రతే మనల్ని ముందుకు నడిపిస్తుంది అని అన్నారు. రాజకీయాలు అనగానే వ్యతిరేక ధోరణిని విడనాడాలని, భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికై చట్టాలు చేయాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి, ఎంజేపి సెక్రటరీ సైదులు, బీసీ కమిషన్ సభ్యులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్‌లో భారీ అగ్నిప్రమాదం

- **ఎలక్ట్రిక్ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు**

**హైదరాబాద్, మే 14 సిరిన్యూస్:**



హయత్‌నగర్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ షాపులో మొదలైన మంటలు.. క్షణాల్లోనే పక్కనే ఉన్న పరుపుల షాపుకు విస్తరించి భీభత్సాన్ని సృష్టించాయి. ఎగిసిపడుతున్న మంటలు, దట్టమైన పొగతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ముందుగా జయశ్రీ ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ షాపులో మంటలు చెలరేగాయి. ఆ మంటలు పక్కనే ఉన్న పరుపుల తయారీ షాపుకు వ్యాపించడంతో ప్రమాద తీవ్రత రెట్టింపైంది. పరుపులు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి.. ఆ రెండు షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటల ధాటికి సమీపంలోని మరో రెండు షాపులు కూడా స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో షాపుల బయట నిలిపి ఉంచిన ఒక బైక్ కూడా పూర్తిగా కాలి బూడిదైపోయింది. సమాచారం అందుకున్న వెంటనే హయత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే, షాపు లోపల పరుపుల నిల్వలు ఉండటంతో.. మంటలు ఆరిపోయినట్టే కనిపిస్తూనే మళ్లీ మళ్లీ రాజుకున్నాయి. ఈ ఘటనలో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ప్రస్తుతం ఫైర్ సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తూ మంటలు పూర్తిగా ఆరిపోయేలా చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏసీబీకి చిక్కిన మరో లంచావతారం

- **10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

**వరంగల్, మే సిరిన్యూస్:**

పూర్వీకుల ఆస్తిని తన పేరుపై మ్యుటేషన్ కోసం సంప్రదించిన బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తహసీల్ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న జి రాంబాబు బాధితుడి నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా గురువారం వరంగల్ రేంజ్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని ఆర్‌ఐపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీబీ అధికారులు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని, వాట్సాప్ నంబర్ 9440446106కు కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# సుబోధ్ సింగ్ గ్యాంగ్ పనే..

**మొదటిపేజీ తరువాయి**

వివిధ రాష్ట్రాల్లో గాలిస్తున్నట్లు తెలిపారు.

ఈ నెల 3న జరిగిన దోపిడీలో దుండగులు జ్యువెలరీ షాపులోకి చొరబడి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు ఉద్యోగులు గాయపడగా, భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు, వజ్రాలను దోచుకెళ్లారు. ఈ మొత్తం ఆపరేషన్‌కు బీహార్‌లోని పూర్నియా జైలులో ఉన్న సుబోధ్ సింగ్ ప్రధాన సూత్రధారిగా వ్యవహరించినట్లు దర్యాప్తులో తేలిందని కమిషనర్ తెలిపారు.

సుబోధ్ సింగ్ ముఠా బీహార్, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో పలు దోపిడీలకు పాల్పడిన చరిత్ర ఉందన్నారు. తెలంగాణలో ఇంత ప్రణాళికాబద్ధంగా దోపిడీ చేయడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

దోపిడీకి నాయకత్వం వహించిన రఘునాథ్ కర్మకార్‌తో పాటు రవిష్ కుమార్, మెహతాబ్ ఖాన్‌లను పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వీరిలో ఇద్దరు కాల్పులకు పాల్పడిన షూటర్లు కాగా, మరొకరు సహాయకుడిగా వ్యవహరించినట్లు తెలిపారు.

దోపిడీకి రెండు నెలల ముందే నిందితులు ఖమ్మం, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తులో బయటపడింది. అనంతరం కరీంనగర్‌ను లక్ష్యంగా ఎంచుకుని పథకం అమలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘటన తర్వాత నిందితులు బైక్‌లపై ధర్మపురికి చేరుకుని అక్కడి నుంచి మూడు బృందాలుగా విడిపోయి రైళ్లు, బస్సుల ద్వారా పరారైనట్లు వెల్లడించారు.

అరెస్టయిన నిందితుల నుంచి రూ.51 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు సిమ్ కార్డులు, నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని, సుబోధ్ సింగ్‌ను విచారించేందుకు కోర్టు అనుమతి కోరనున్నట్లు కమిషనర్ వివరించారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**నల్లగొండ/ఖమ్మం, మే 14 సిరిన్యూస్:**

రాష్ట్ర వ్యవసాయ చరిత్రలోనే ముందెన్నడూ లేని రీతిలో రబీ సీజన్‌లో 65 లక్షల ఎకరాలకుపైగా వరి సాగు జరిగిందని, 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ధాన్యం దిగుబడితో పాటు కొనుగోళ్లలో చరిత్రలో రాష్ట్రం ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించేందుకు ఆయన నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో గురువారం పర్యటించారు. నల్లగొండ జిల్లాలో సహచర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరు లక్ష్మణ్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర నల్గొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. అదేవిధంగా ఖమ్మం జిల్లాలో సహచర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు మోసం జరిగితే ఉపేక్షించబోమని, చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని, చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని స్పష్టం చేశారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం రూ.22,000 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణాలో జాప్యం తగదని, అందుబాటులో ఉన్న వాహనాలు వినియోగించి సత్వరమే రవాణా చేయాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. కనగల్ మండలంలోని చెట్లచెన్నారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంత్రి స్వయంగా కొనుగోలు ప్రక్రియను పరిశీలించి పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన హమాలీలతో ఆయన మాట్లాడారు. భారీ స్థాయిలో ధాన్యం తరలింపులో వారు అందిస్తున్న సేవలను అభినందిస్తూ వారికి మెరుగైన వసతులు, సంక్షేమ సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అదే మండలంలోని బాలాజీ రైస్ మిల్లును సందర్శించి మిల్లింగ్ కార్యకలాపాలు, కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ కేంద్రాలకు తరలింపు పనులను సమీక్షించారు. ఖమ్మం జిల్లాలోని నాయకన్‌గూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మంత్రి కొనుగోళ్లు, మిల్లులకు ధాన్యం తరలింపును వేగవంతం చేసే చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. అన్ని జిల్లాల కలెక్టర్లు అందుబాటులో ఉన్న అన్ని లారీలు, డీసీఎంలను కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులు, గోదాములకు ధాన్యం తరలింపునకు వినియోగించాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. అవసరమైతే ఇసుక రవాణా, ఇతర ప్రాధాన్యం లేని పనుల్లో నిమగ్నమైన వాహనాలను కూడా బలవంతంగా ధాన్యం రవాణాకు వినియోగించాలని స్పష్టం చేశారు. రబీ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని సిమెంట్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు తమ వద్ద ఉన్న లారీలను ధాన్యం రవాణాకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చివరి గింజ ఎత్తేవరకు కొనుగోళ్లు కొనసాగుతాయి.. రైతులకు ఇది ప్రభుత్వ హామీ అని మంత్రి స్పష్టం చేశారు. రికార్డు స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 18.67 కోట్ల గన్నీ సంచులు సిద్ధంగా ఉంచామని, 1,800కిపైగా రైస్ మిల్లర్లు మిల్లింగ్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. దేశంలోనే నంబర్ 1 వరి ఉత్పత్తి రాష్ట్రంగా తెలంగాణను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఇది కేవలం ధాన్యం కొనుగోలు కార్యక్రమం కాదు.. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం అని మంత్రి ఉత్తమ్

## లింగంపల్లిలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం ఘనంగా



**మునిపల్లి, మే 14 (సిరి న్యూస్):**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం మునిపల్లి మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లోడి సతీష్ ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ రాజనర్సింహ, కంకోల్ సర్పంచ్ మమత నాగేష్,మక్సూద్ పటేల్, కమ్మల్పల్లి సంగమేశ్వర్, గుడ్డు పటేల్, ఏఎంసీ డైరెక్టర్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

## మీడియా రంగంలో నైపుణ్యాలతో రాణించాలి

**గీతం విద్యార్థులకు ప్రొఫెసర్ సంజీవ్ కుమార్ సూచన**

**ముగిసిన రెండు వారాల జాతీయ విద్యా ఇమ్మర్షన్ కార్యక్రమం**






**రామచంద్రపురం,(పటాన్చెరు), మే 14, (సిరి న్యూస్):**

మీడియా రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకొని వృత్తిపరంగా ముందుకు సాగాలని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ సంజీవ్ కుమార్ విద్యార్థులకు సూచించారు.పూణేలోని ఎంఐటీ-డబ్ల్యూపీయూ విశ్వవిద్యాలయ సహకారంతో గీతం డీమ్డ్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు వారాల "జాతీయ విద్యా ఇమ్మర్షన్ కార్యక్రమం" ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆచరణాత్మక అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పరిశ్రమ అవస రాలపై స్పష్టతను పెంచిందన్నారు.ఎంఐటీ-డబ్ల్యూపీయూ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ అను నాయర్ మాట్లాడుతూ, 71 మంది విద్యార్థుల భాగస్వామ్యం కార్యక్రమాన్ని విజయవంతం చేసిందన్నారు. భవిష్యత్తులో గీతం యూనివర్సిటీతో మరిన్ని సంయుక్త కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.మే 1 నుంచి 14 వరకు సాగిన ఈ కార్యక్రమంలో డిజిటల్ స్టోరీటెల్లింగ్, మోషన్ గ్రాఫిక్స్, ఆడియో ప్రొడక్షన్ వంటి అంశాలపై విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ అందించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు.

## పటాన్‌చెరు అభివృద్ధికి సంపూర్ణ సహకారం ఇవ్వండి

- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**రామచంద్రపురం,(పటాన్చెరు), మే 14,(సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు.గురువారం సాయంత్రం సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించారు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా చేపట్టనున్న పనులకు నిధులు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అలాగే అమీన్పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి కోట అభివృద్ధి పనులపై కూడా చర్చ జరిగింది. హెచ్ఎండీఏ అధికారులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు పేర్కొన్న ఎమ్మెల్యే, రెవెన్యూ శాఖ తరపున ఎన్ఓసీ జారీ చేయాలని కోరారు. కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజోపయోగ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# రైతుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ సర్కార్

- **ముఖ్యమంత్రి ఫీల్డ్ విజిట్ చేయాలని డిమాండ్.**
- **కేంద్రం సహకరిస్తున్నా రాష్ట్రం వైఫల్యం.**
- **బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు**

**రామాయంపేట, మే 14 (సిరి న్యూస్)**



రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల అన్నదాతలు కొనుగోలు కేంద్రాల వద్ద పడరాని కష్టాలు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. గురువారం రామాయంపేట శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు బీజేపీ కార్యకర్తలతో కలిసి సందర్శించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో మంత్రులతో రివ్యూలు నిర్వహించడం కాదని, ఒక్కసారి ఫీల్డ్ మీదకు వస్తే రైతులు పడుతున్న కష్టాలు కళ్లకు కనిపిస్తాయన్నారు. 20–25 రోజులుగా రైతులు ఎండలో ఎండుతూ, రాత్రింబవళ్లు ధాన్యానికి కాపలా కాస్తున్నా, ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం" అని మండిపడ్డారు.

### కేంద్రం సహకరిస్తున్నా రాష్ట్రం వైఫల్యం

ధాన్యం కొనుగోలుకు సంబంధించి గన్నీ బస్తాలు, సుతిలి, కమీషన్ వంటి ఖర్చులన్నీ కేంద్ర ప్రభుత్వం భరిస్తున్నప్పటికీ, వాటిని సక్రమంగా నిర్వహించి రైస్ మిల్లులకు పంపాల్సిన కనీస బాధ్యతను కూడా రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం సిగ్గుచేటని వారు విమర్శించారు. తెలంగాణ చరిత్రలో రైతులు ఇంతలా ఇబ్బంది పడిన రోజులు ఎన్నడూ లేవన్నారు.కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో ప్రతి బస్తాపై 5 నుండి 6 కిలోల వరకు అదనంగా తీసుకుంటూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అబద్ధాల, అవినీతి, కమీషన్ల ప్రభుత్వమని, రైతుల పాలిట శాపంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కలెక్టరేట్ దిగ్బంధిస్తామని హెచ్చరిక.

జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్వెం టనే క్షేత్రస్థాయిలో పర్యటించి, అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను తక్షణమే ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన నిలబడి అన్ని కొనుగోలు కేంద్రాలతో పాటు కలెక్టరేట్‌ను కూడా దిగ్బంధిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్ శంకర్, పార్టీ నాయకులు చింతల శేఖర్, భానుచందర్, బాస0 అనిల్, యాదగిరి యాదవ్, దోమకొండ రాములు, సంతోష్, వెల్మల రమేష్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



# పండగ వాతావరణం లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు

**వెల్దుర్తి మే,14(సిరి న్యూస్) :**



వెల్దుర్తి మండల కేంద్రం లోని కోటకింద పండగల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం ఆనందోత్సహాల మధ్య ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామాల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ...కూలి పనుల చేసుకుంటూ జీవనం సాగించేవారని,సొంతిల్లు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నవారి కుటుంబాలకు రాజన్న చొరవతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం వారి జీవితంలో కొత్త ఆశలను నింపిందని లబ్ధిదారులు తెలిపారు.మాకు సొంతింటి కలను నిజం చేసిన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులకు జీవితాంతం రుణపడి ఉంటామని, ఇప్పుడు మా స్వగ్రామంలోనే ఉండి పని చేసుకుంటూ ఆనందంగా జీవించగలుగుతున్నామన్నారు.అనంతరం గ్రామస్తులంతా జై కాంగ్రెస్ జై రాజన్న అనే నిదానాలతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు . అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 16న జరగబోయే రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కంటి పరీక్షలు బాలాజీ గార్డెన్స్ యందు నిర్వహించబడతాయని దీన్ని మండల ప్రజలు ఉపయోగించుకొని వారి కంటి సమస్యలు ఏవైనా ఉంటే తక్షణమే వారికి వాసన్ కేర్ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటి శాస్త్ర చికిత్సలు కూడా నిర్వహిస్తారని, ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రాజన్న ఫౌండేషన్ అధినేత ఆవుల రాజిరెడ్డి అన్న కి మండల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, నాయకులు ఆంజనేయులు, నరసింహారెడ్డి, మల్లేశం, ముక్తా బాయ్, నవీన్ గుప్తా, వెంకట్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్య వారోత్సవాలు

**వెల్దుర్తి,మే 14( సిరి న్యూస్):**



ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం వెల్దుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు ముఖ్య అతిథిగా హాజరైనారు. జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు, మాట్లాడుతూ తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, ప్రభుత్వ పాఠశాలల ను బలోపేతం చేయాలని, మీ పిల్లల ను పాఠశాలకు ప్రతిరోజు వచ్చే విధంగా చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని కావున ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరాలని తెలియజేశారు మరియు ఈ సందర్భంగా విద్యార్థుల అభివృద్ధి,విద్యా ప్రమాణల పెంపు,పాఠశాల పురోగతి వంటి అంశాలపై తల్లిదండ్రులతో చర్చించారు. అలాగే బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సాంబయ్య ఆధ్వర్యంలో ఈ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని కావున మీ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలియజేశారు. ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను పొందేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో మొదటి ర్యాంకు వచ్చిన జి. అక్షయ,రెండవ ర్యాంకు వచ్చిన ఎస్.మేఘన మూడవ ర్యాంకు వచ్చిన ఆర్. లిప్సిక లను కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సాంబయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మాధురి ఉపాధ్యాయులు వెంకట స్వామి, శ్రీనివాస్ రావు,నరసింహారెడ్డి, చార్లెస్,అర్చన,అమూల్య,శైలజ, వెంకట్ రెడ్డి, ధనరాజ్,వాణిశ్రీ, జయసుధ, విజయ మోహన్ రాజ్, ప్రశాంతి దేవి, రేణుకా దేవి,రాము, రాధిక ప్రియదర్శిని, ఖదీర్ పాషా, మల్లేశం,సిఆర్పి రాజు,శీను, షాబెర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# తరుగు తీస్తే కఠిన చర్యలు

- **ధాన్యం తడిసిపోకుండా వెంటనే అన్లోడ్ చేయాలి**
- **జిల్లా అడిషనల్ కలెక్టర్ పాండు**
- **రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు**

**సంగారెడ్డి, మే 14 (సిరి న్యూస్):**


జిల్లా అడిషనల్ కలెక్టర్ పాండు గురువారం జోగిపేట లోని రామకృష్ణ రైస్ మిల్లును, పుల్కల్ మండలం కోడూరు లోని ఎస్ బి ఎం రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న ధాన్యం లారీల సంఖ్య, అన్లోడింగ్ సమయం మరియు మిల్లింగ్ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ధాన్యం తడిసి పోకుండా వెంటవెంటనే అన్లోడ్ చేసుకోవాలని, ఇందుకోసం అవసరమైతే ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం తరుగు తీస్తున్నారా అనే అంశంపై ఆరా తీసిన అడిషనల్ కలెక్టర్, నిల్వ సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో మిల్లింగ్ జరపాలని హితవు పలికారు. ధాన్యం భద్రపరచడానికి సమీపంలోని రైతు వేదికలను వినియోగించుకోవాలని తెలుపుతూ, అన్లోడింగ్ ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకుండా పకడ్బందీగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.



# రాంగ్ రూట్లో దూసుకెళ్తున్న భారీ వాహనాలు..

- **రాంగ్ రూట్లో భారీ వాహనాలు.. ప్రాణాలతో చెలగాటం!**
- **ఎడ్జ్ వైట్ లైన్ లేక అయోమయంలో వాహనదారులు**

**మునిపల్లి, మే 14 (సిరి న్యూస్):**



నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి–65లో మొగ్ధంపల్లి చౌరస్తా వద్ద సంగారెడ్డి నుంచి జహీరాబాద్ వైపు వెళ్లే మార్గంలో భారీ వాహనాలు రాంగ్ రూట్లో ప్రయాణించడం వాహనదారుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే భారీ వాహనాల కారణంగా ప్రయాణికులు ప్రాణభయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.రహదారిపై ఎడ్జ్ వైట్ లైన్ లేకపోవడం, మరోవైపు మట్టి పేరుకుపోవడంతో రోడ్డు మార్గం స్పష్టంగా కనిపించక వాహనదారులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొంది.ఇంత తీవ్రమైన సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రాంగ్ రూట్లో వెళ్లే భారీ వాహనాలపై వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు రహదారిపై ఎడ్జ్ వైట్ లైన్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పాఠశాల ప్రవేశాలకు లక్కీ డిప్

- **నిరుపేదలైన గిరిజన విద్యార్థిని విద్యార్థుల ఎంపిక.**
- **ఉన్నత విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.**
- **బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు 2026-27 సంవత్సరంలో ప్రవేశం కొరకులక్కీ డిప్.**
- **మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్.**

**మెదక్ మే,14(సిరిన్యూస్)**

నిరుపేదలైన గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని,ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకొని మంచి విద్యా బుద్ధులతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. గురువారం గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాల (B.A.S) లో ప్రవేశాల కోసం విద్యార్థుల ఎంపికను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం లో పూర్తి స్థాయిలో ఉచితంగా విద్యను భోదించడంతో పాటు వారికి అవసరమైన భోజన వసతి సౌకర్యాలను కూడా పూర్తిగా ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు ఉత్తమ పలితాలను సాధించి సమాజంలో ముందు స్థానంలో ఉండాలని ఆయన సూచించారు. లక్కీ డిప్ ద్వారా ఎంపికైన విద్యార్థుల వివరాలు తెలియజేస్తూ. మూడవ తరగతిలో మొత్తం 10 సీట్లు ఉండగా



అందులో 33% భాలికల రిసర్వేషన్ కోటా కింద 03 మంది భాలికలు మరియు జనరల్ కోటా కింద 7 మంది బాలురు,5వ తరగతిలో 05 సీట్లు ఉండగా అందులో 33% భాలికల రిసర్వేషన్ కోటా కింద ఒక్కరు భాలిక మరియు జనరల్ కోటా కింద ఒక్కరు భాలిక, 3 మంది భాలురు అలాగే 8వ తరగతిలో 05 సీట్లు ఉండగా అందులో 33% భాలికల రిజర్వేషన్ కోటా కింద ఒక్కరు భాలిక మరియు జనరల్ కోటా కింద 4 మంది భాలురు బెస్ట్ అవైలబుల్ పాఠశాలకు ఎంపిక చేసినట్లు వివరించారు ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శ్రీమతి. వి . నీలిమ, గిరిజన వసతి గృహ అధికారులు డి. లింగమూర్తి మరియు కార్యాలయ సిబ్బంది జి. శ్రీకాంత్, సమీర్, పి. శ్రీకాంత్, కె. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అవినీతిపై అత్యున్నత స్థాయి విచారణ జరపండి..

- **ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాసిన మాజీ ఎమ్మెల్యే పట్లోల్ల శశిధర్ రెడ్డి.**

**రామాయంపేట, మే 14 (సిరి న్యూస్)**



రామాయంపేట మున్సిపాలిటీలో సుమారు రెండు కోట్ల వరకు నిధులు దుర్వినియోగం అయ్యాయని వస్తున్న వార్తలపై అత్యున్నత స్థాయి విచారణ జరపాలని మెదక్ మాజీ శాసనసభ్యుడు, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు పట్లోళ్ల శశిధర్ రెడ్డి గురువారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ ద్వారా విజ్ఞప్తి చేశారు. గత ఏడాది కిందట మున్సిపల్ లో కోటి అరవై లక్షలు, ప్రస్తుతం మరో 30 లక్షలు అవినీతి జరిగిందని, అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని, సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తామని, ఎన్నికలకు ముందు సాధ్యం కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం లో రోజురోజుకు అభివృద్ధి జరగాల్సింది పోయి, అవినీతి పెరుగుతుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా రామాయంపేట మున్సిపాలిటీ లో జరిగిన అవినీతి అక్రమాలపై అత్యున్నత స్థాయి అధికారుల చేత విచారణ జరిపి, బాధ్యులైన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# కొనుగోలు,రవాణా ఆలస్యం కావద్దు...





- **లక్ష్మాపూర్, కాట్రియాల కొనుగోలు కేంద్రాల పరిశీలన.**
- **మిల్ లో ఆన్ లోడింగ్ త్వరగా కావాలి.**
- **కొనుగోళ్లు పూర్తి అయ్యేవరకు అధికారులు క్షేత్ర స్థాయి లో ఉండాలి.**
- **అదనపు కలెక్టర్ నగేష్..**

**రామాయంపేట, మే 14( సిరి న్యూస్)**

జిల్లా లో ఏర్పాటు చేసిన అన్నీ కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం కావాలని, ప్రతీ అధికారి కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియ సాఫిగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. గురువారం రామాయంపేట మండలం లక్ష్మాపూర్, కాట్రియాల్ గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ నగేష్ ఆకస్మికంగా సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత కొనుగోలు చేశారు , ఎంత మంది హమాలీ లు ఉన్నారు,సరిపడా గన్ని బ్యాగ్ లు, టార్పాలీన్ లు ఉన్నాయా, లారీ లు వచ్చాయా లేదా,లోడింగ్ కి ఎంత టైం తీసుకుంటున్నారు, ట్యాబ్ ఎంట్రీ ఎలా చేస్తున్నారు అని తదితర వివరాలను కలెక్టర్ కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూతేమ శాతం రాగానే.. ఎలాంటి ఆలస్యం లేకుండా కొనుగోలు అవ్వాలని... సరిపడా హమాలీలను పెట్టుకొని కొనుగోలు అయిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లు లకు తరలించాలన్నారుమిల్ కి వెళ్లే ట్రక్ లో కేంద్రానికి సంబందించిన ఒకరిని కూడా పంపించి.... అక్కడ ధాన్యాం త్వరగా ఆన్ లోడ్ అయ్యేలా చూసుకోవాలన్నారు అలాగే opms లో ఎప్పటికప్పుడు కొనుగోలు వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు సివిల్ సప్లై, కో ఆపరేటివ్, వ్యవసాయ, రవాణా తదితర శాఖల అధికారులు ప్రతీ సెంటర్ లను సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా పర్యవేక్షించాలన్నారుఅనంతరం అక్కన్నపేట గోదామును అడిషనల్ కలెక్టర్ నగేష్ సందర్శించి, అన్‌లోడింగ్‌ను వేగవంతం చేయాలని మరియు OPM ఎంట్రీలను పూర్తి చేయాలని ఇన్‌చార్జ్‌కు సూచించారు. ప్రస్తుతం 40 మంది హమాలీలు పనిచేస్తున్నారని వివరించారు.ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ వేళ సామరస్యం ముఖ్యం

**పశువుల అక్రమ రవాణాపై డేగకన్ను**
**డీఎస్పీల పర్యవేక్షణలో 24/7 చెక్ పోస్టులు**
**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**




**సంగారెడ్డి, మే 14 (సిరి న్యూస్):**

బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మత పెద్దలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడిన పోలీసులు, పండుగను పరస్పర సహకారంతో జరుపుకోవాలని సూచించారు. జిల్లా సరిహద్దుల్లో పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు డీఎస్పీల పర్యవేక్షణలో నిరంతరాయంగా చెక్‌పోస్టుల తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే వారిపై సైబర్ క్రైమ్ విభాగం ప్రత్యేక నిఘా ఉంచిందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే డయల్–100 లేదా కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656739కు ఫోన్ చేయాలని కోరుతూ, జిల్లా ప్రజలందరూ బాధ్యతా యుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ విన్నవించారు.

## మున్సిపాలిటీలో నిధుల గోల్ మాల్ పై విచారణ జరపాలి.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.**
**ప్రజల సొమ్మును కాపాడాలి.**
**బిజెపి కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్.**

**రామాయంపేట, మే 14 (సిరి న్యూస్)**
**రామాయంపేట**




మున్సిపాలిటీలో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, అధికారుల నిర్లక్ష్యం వల్ల పట్టణ అభివృద్ధి కుంటుపడుతోందని బిజెపి కౌన్సిలర్ జె. శంకర్ గౌడ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సుమారు 30 లక్షల రూపాయల మున్సిపల్ నిధులను కమిషనర్ మరియు ఇతర ఉన్నతాధికారులు నిబంధనలకు విరుద్ధంగా దారి మళ్లించారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ మరియు స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.గురువారం నాడు ఆయన మున్సిపల్ కార్యాలయం ముందు కూర్చుని, ప్లే కార్డు పట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.రామాయంపేట మున్సిపాలిటీ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే మౌలిక సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడుతోందని శంకర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు చెల్లించే పన్నులు మరియు 15వ ఆర్థిక సంఘం నిధులపైనే మున్సిపాలిటీ ఆధారపడి నడుస్తున్న తరుణంలో, నిధుల గోల్‌మాల్ జరగడం అన్యాయమని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్, మేనేజర్, అకౌంటెంట్ మరియు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (RI)లు కౌన్సిల్ తీర్మానం లేకుండా, కనీసం చైర్‌పర్సన్ దృష్టికి కూడా తీసుకెళ్లకుండా కేవలం మూడు నెలల వ్యవధిలోనే 30 లక్షల రూపాయలను డ్రా చేశారని ఆయన వివరించారు. ఇందులో మున్సిపల్ ఎన్నికల ఖర్చుల పేరిట 15 లక్షలు, జనరల్ ఫండ్ నుండి మరో 15 లక్షలు పక్కదారి పట్టాయని తెలిపారు.కేవలం ఇప్పుడే కాకుండా, ఆరు నెలల క్రితం కూడా 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి దాదాపు కోటి రూపాయల మేర దుర్వినియోగం జరిగిందని శంకర్ గౌడ్ గుర్తు చేశారు. పట్టణంలో ఇన్‌ఛార్జ్ కమిషనర్, టీపీఓ, ఏఈ మరియు అకౌంటెంట్ వంటి కీలక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం వల్ల పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని విమర్శించారు. అధికారుల గైర్హాజరు వల్ల సామాన్య ప్రజలు సేవలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.ఈ అవినీతి భాగోతానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పూర్తి బాధ్యత వహించాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులను వెంటనే విధుల నుండి సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దుర్వినియోగం చేసిన నిధులను వారి నుండి రికవరీ చేసి తిరిగి మున్సిపల్ ఖాతాలో జమ చేయాలని కోరారు. ముఖ్యంగా 2020 నుండి 2024–25 వరకు మున్సిపాలిటీలో జరిగిన ప్రతి ఆర్థిక లావాదేవీపై, రికార్డులపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాధనాన్ని కాపాడటంలో ప్రభుత్వం విఫలమైతే ప్రజల్లో నమ్మకం పోతుందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని శంకర్ గౌడ్ స్పష్టం చేశారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానిస్తాయి

**కేపీఎల్ టోర్నమెంట్ అధినేత విశ్వేశ్వర్**

**వెల్దుర్తి,మే 14, (సిరి న్యూస్ )**



క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, క్రికెట్, తదితర క్రీడలు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని కుక్కునూరు గ్రామ యువ నాయకుడు పుట్నాల విశ్వేశ్వర్ అన్నారు. వెల్దుర్తి మండలం కుక్కునూరు గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటును తన సొంత నిధులతో సుమారు 40 టీంలు పోటీ చేసే విధంగా కేపీఎల్ టోర్నమెంట్ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విశ్వేశ్వర్ మాట్లాడుతూ మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెల రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో ఆసక్తి గల యువకులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కుకునూరు గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, యువత మొబైల్ ఫోన్లకు అధికంగా అలవాటు పడి అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిస్తూ క్రీడల పట్ల ఆసక్తి పెంచాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో యువ నాయకుడు విశ్వేశ్వర్ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రీడలపై దృష్టి సారించి ఆరోగ్యంతో పాటు భవిష్యత్తును కూడా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నవీన్, గ్రామ యువకులు పాల్గొన్నారు.




# ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాల పంపిణీ ఘనంగా గణ సన్మానం!!

**శివంపేట మే 14 ( సిరి న్యూస్ )**




శివంపేట మండలంలో 2025–26 విద్యా సంవత్సరం లో అత్యధిక హాజరు కనబరిచిన ఉపాధ్యాయులకు శివంపేట మండల విద్యాశాఖ అధికారి బుచ్యా నాయక్ ప్రశంసా పత్రాలు అందించి శాలువా తో ఘనంగా సన్మానించారు.రాష్ట్ర ప్రభుత్వం గత విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు హాజరు ఎఫ్ఆర్ఎస్ విధానంలో అత్యధికంగా హాజరు నమోదైన ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలాస్ ఐఏఎస్ ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు.వీటిని శివంపేట్ మండల విద్యాశాఖ అధికారి ఆయా ఉపాధ్యాయులకు అందించడం జరిగింది. భవిష్యత్తులో కూడా ఇలాగే అత్యుత్తమ హాజరు కనబరిచి అత్యుత్తమ విద్యాబోధన చేసి ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈఓ అభిప్రాయపడ్డారు అత్యధిక హాజరు కనబరిచిన ఉపాధ్యాయులు వరగంటి సంతోష్ కుమార్ ఎస్ ఎ సోషల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చండి, గౌరీ శంకర్ ఎస్ఏ మ్యాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దొంతి, సాయిరాం ఎస్ ఏ తెలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దొంతి,మెట్టు శేఖర్ ఎస్ జి టి ప్రాథమిక పాఠశాల శివాలయ నగర్ గద్వాల అభిలాష్ ఎస్ జి టి ప్రాథమిక పాఠశాల తిమ్మాపూర్ ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ లు రవీందర్ , అంజ్య ఎం ఐ ఎస్ హరికృష్ణ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివంపేట్ ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్‌లో ఘనంగా బడి బాట నిర్వహణ




**దుబ్బాక ప్రతినిధి, మే 14,(సిరి న్యూస్):**
సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో గురువారం మండల పరిషత్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, పెంటయ్య నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాదని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి మంచి విద్య అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పలు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి విద్య ప్రాముఖ్యతపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వన్నెల విజయ్ కుమార్, ఇరు పాఠశాలల ఉపాధ్యాయ బృందం సభ్యులు మల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, కవిత, రాములు, సరిత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కక్కిరాల రమేష్



**దమ్మపేట, మే 14, (సిరి న్యూస్):**దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా కక్కిరాల రమేష్ ను నియమిస్తున్నట్లు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గురువారం ప్రకటించారు. ఈ నియామకంపై నూతన అధ్యక్షుడు కక్కిరాల రమేష్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న మరియు సహకరించిన ప్రతీ ఒక్క మండల సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కక్కిరాల రమేష్ నియామకం పట్ల దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ అభిమాన సీనియర్ నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించబడటం తమకు సంతోషంగా ఉందని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# రేబర్తిలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట




**చేర్యాల రూరల్, మే 14, (సిరి న్యూస్):**
మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. పేరెంట్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి వరదరాజు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్ పర్సన్ నిర్మల, గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు చంద్ర బాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ వరదరాజులు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామంలో ఉన్నటువంటి విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేయవలసిందిగా విద్యార్థులు తల్లిదండ్రులను గ్రామ పెద్దలను కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న సకల సౌకర్యాలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా రేబర్తి ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ఉప్పరోనిగడ్డ విద్యార్థిని కుమారి శ్రీవల్లిని ఆ గ్రామ సర్పంచ్ రామస్వామి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరు బాగా చదువుకొని బాగుపడాలని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి మా గ్రామం నుంచి విద్యార్థులను రెబర్తి ఉన్నత పాఠశాలకు పంపుతామని హామీ ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, సంపత్ కుమార్, చంద్రారెడ్డి, రవి, మల్లేశం, నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్, కవిత, రఫత్, ఉమర్, నసీరుద్దీన్ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# 14వ వార్డులో ఉచిత యోగా శిబిరం

**గుంటుకు లక్ష్మి శ్రీనివాస్**



**గజ్వేల్ టౌన్, మే 14, (సిరి న్యూస్):**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ 14వ వార్డు భారత్ నగర్ వినాయక మండపం దగ్గర ఉదయం 6 నుండి 7 వరకు గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, యోగా గురువు అనిత ఆధ్వర్యంలో ఉచిత యోగా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ యోగాలో పాల్గొన్న అందరికీ ప్లాస్టిక్ గ్లాసులు నిషేధిస్తూ, స్టీల్ గ్లాసులలో అంబలి వితరణ చేయడం జరిగిందన్నారు. శరీర దృఢత్వం కోసం, మెంటల్ గా స్ట్రాంగ్ ఉండడం కోసం ప్రతి ఒక్కరూ యోగ చేయాలని, యోగాలో పాల్గొన్న పిల్లలు అందరూ చాలా చక్కగా భగవద్గీత శ్లోకాలు పాడారని, ఈ ఉచిత యోగా శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

# ఎన్నికల జాబితా ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకం






- **భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్**

**మెదక్ మే,14(సిరిన్యూస్)**

ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ అన్నారు. గురువారం ఎంపిక చేసిన రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాలను నవీకరించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడు,18 సంవత్సరాలు నిండిన వారు, ఆయా నియోజకవర్గంలో సాధారణ నివాసితులు, చట్టపరంగా అనర్హులు కాని వారు ఓటరుగా నమోదు కావచ్చని తెలిపారు.యువ ఓటర్ల నమోదు, మహిళల భాగస్వామ్యం, దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఇంటింటి సర్వేలు, పోలింగ్ స్థాయి అధికారుల పని తీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు,తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాలపట్టికలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, దేశ వ్యాప్తంగా గతంలో కూడా పలు మార్లు ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని, అక్టోబర్ 27, 2025 నాటికి ఉన్న ఓటర్లందరికీ పాక్షికంగా పూరించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ఫారమ్‌ల సేకరణ కోసం బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని కనీసం 3 సార్లు సందర్శించేలా చూడాలని, ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను సమకూర్చడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, ఉపాధి జగ్గారెడ్డి లక్ష్యం..

- **ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్ గా అనేక పరిశ్రమలు**
- **రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన అనంతరం 650కోట్లతో ఫుడ్ పరిశ్రమ ఏర్పాటు**
- **తొగర్ పల్లి లో నేడు భూమి పూజ చేయనున్న మంత్రులు, శ్రీధర్ బాబు, దామోదర.**




**కొండాపూర్, మే14(సిరి న్యూస్):**

అభివృద్ధిపై ఆశయంతో యువతకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి లక్ష్యంగా పనిచేస్తున్నారు. జగ్గారెడ్డి సంగారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గా పనిచేసిన సమయంలో మల్లెపల్లి, సంగారెడ్డి మండలం కొత్లపూర్ శివారులలో బీరు పరిశ్రమలతో పాటు అనేక పరిశ్రమలను నెలకొల్పేందుకు ప్రోత్సహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అభివృద్ధి, ఉపాధి, మహిళా సంక్షేమానికి పాడుతూ జగ్గారెడ్డి మాట తప్పకుండా హామీలను నెరవేర్చేందుకు ముందు నడుస్తున్నారు. అంతేకాకుండా ఆపదలో ఉన్న వారి కుటుంబాలకు అప్పనహస్తంగా వైద్య చికిత్సకు లక్షల రూపాయలను అందించి ఆసరాగా నిలుస్తున్నారు...నేడు తొగర్ పల్లిలో రూ.650 కోట్ల పెట్టుబడి, 44 ఎకరాల్లో భారీ ఫుడ్ పరిశ్రమ ఏర్పాటు.1,500 మందికి స్థానిక యువత,మహిళలకు ఉపాధి అవకాశాలకు జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి కృషితో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రోత్సాహంతో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి సహకారంతో ఫుడ్ పరిశ్రమ ఏర్పడుతుంది.స్థానిక యువతకు ఉపాధి – పారిశ్రామికాభివృద్ధికి ఊతంగా కాన్ఫెక్షనరీ నుంచి బేవరేజెస్ వరకు విస్తృత ఉత్పత్తుల తయారవుతాయి. పాశమైలారం తరహాలో తొగర్‌పల్లిలో భారీ యూనిట్ సంగారెడ్డి నియోజకవర్గంలో మహిళలకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు కానున్నది .కేజేఎస్ ఇండియా ప్రవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కొండాపూర్ మండలం తొగర్‌పల్లి–అలియాబాద్ ప్రాంతంలో సమగ్ర ఆహార, పానీయాల తయారీ కేంద్రానికి నేడు మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిలు భూమిపూజ చేయనున్నారు.సుమారు రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా దాదాపు 1,500 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభించనుండగా, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఇక్కడే పరిశ్రమ నెలకొల్పాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి , టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిలు కోరినట్లు వారి కృషి తోనే పరిశ్రమ స్థాపనకు ముందుకు వచ్చినట్లు పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు.తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న సీఎం రేవంత్ రెడ్డి పాలకవర్గం ప్రోత్సాహంతో సంగారెడ్డిని ఫుడ్ అండ్ ఎఫ్ఎమ్ సీజీహబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నారు.కాన్ఫెక్షనరీ, బేవరేజెస్, కాఫీ, న్యూట్రాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ విభాగాలతో ఏర్పడనున్న ఈ యూనిట్ తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి, స్థానిక యువతకు,మహిళలకు ఉపాధి కల్పనలో కీలకంగా ఉంటుందని స్థానిక ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.సంగారెడ్డి మహిళలకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పరిశ్రమ రావడం ఒక మహిళ గా ఇది నాకు గర్వ కారణంగా ఉందని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు.సంగారెడ్డి నియోజకవర్గం లో 1500 మహిళలకు ఈ పరిశ్రమ ద్వారా ఉపాధి లభిస్తుండటం సంతోషంగా ఉందని ఒక మహిళగా ఇది నాకు గర్వ కారణంగా ఉందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకట స్వామి ల సహకారం వల్లనే ఇది సాధ్యమైందని నిర్మల రెడ్డి వెల్లడించారు.



# మన శరీరంలో కాలేయం అత్యంత కీలకమైన అవయవం

- **మొగుళ్లపల్లి మండల వైద్యాధికారిణి డాక్టర్ నవత**


**ఉమ్మడి వరంగల్ బ్యూరో, మే 14, (సిరి న్యూస్):**
మన శరీరంలో అత్యంత కీలకమైన అవయవాలలో కాలేయం (లివర్ )ఒకటని, ఇది శరీరంలో అనేక ముఖ్యమైన జీవక్రియలకు కేంద్ర బిందువుగా పనిచేస్తుందని, మనం తీసుకునే ఆహారం, నీరు, ఔషధాలు వంటి అన్ని పదార్థాలను శుద్ధి చేయడంలో కాలేయం ప్రధాన పాత్ర పోషిస్తుందని, ఇది 500లకు పైగా ముఖ్యమైన విధులను నిర్వహిస్తుందని మొగుళ్ళపల్లి మండల వైద్యాధికారిణి డాక్టర్ నవత అన్నారు. గురువారం మొగుళ్లపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాలేయానికి ప్రత్యేకంగా పునరుత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వలన తీవ్రమైన నష్టం కలగవచ్చని, ముఖ్యంగా కాలేయం దెబ్బతిన్న ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోవడం వల్ల దీనిని నిశ్శబ్దహంతకుడు అని పిలుస్తారని తెలిపారు. ప్రస్తుతం కాలేయ వ్యాధులు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్నాయని, మద్య సేవనం మాత్రమే కాకుండా అధిక కొవ్వు వున్న ఆహారం, జంక్ ఫుడ్, వ్యాయామం లేకపోవడం వంటి ఆధునిక జీవనశైలి కారణంగా "నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ " కేసులు కూడా ఘననీయంగా పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు.ప్రతిరోజు కనీసం 30 నుండి 45 నిమిషాలు వ్యాయామం చేయాలని, సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్, అధిక కొవ్వు పదార్థాలు, చక్కెర పానీయాలు తగ్గించాలన్నారు. మద్యపానం పూర్తిగా నివారించాలని, తగినంత నీరు తాగాలని, ఏడాదికి ఒకసారి కాలేయ పనితీరు పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెపటైటిస్ బి వంటి వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని, "మంచి అలవాట్లు – పటిష్టమైన కాలేయం"అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలన్నారు. ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణంలో పౌరుల ఆరోగ్యమే కీలకమని, కాలేయము మన శరీరంలోని నిశ్శబ్ద ఇంజన్



వంటిదని, అది ఎంత స్మూత్ గా రన్ అయితే, మన జీవితమంతా కాలం సాఫీగా సాగుతుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మన కాలేయాన్ని కాపాడుకుందాం అని ప్రతిజ్ఞ చేద్దాం. కాలేయ రక్షణ జీవన రక్ష అని గుర్తిద్దామన్నారు.

# విద్యా వారోత్సవాల్లో పాల్గొన్న పాలక వర్గ సభ్యులు

**దమ్మపేట, మే 14, (సిరి న్యూస్)::** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99రోజుల ప్రణాళికలో భాగంగా మే 11 నుండి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా వారోత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా దమ్మపేట పంచాయతీ పరిధిలో పలు ప్రాథమిక పాఠశాలలో, జెడ్పిహెచెస్ లో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, చాట్ల శ్రీనివాసరావు, బత్తుల సాయి, ఉయ్యాల లక్ష్మీనారాయణ, దాసరోజు సరిత రామారావు, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, పసుమర్తి కుసుమాంబ, ధర్మసోతు పద్మ తదితరులు గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని పాఠశాలల మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయ సిబ్బంది ద్వారా తల్లి తండ్రులకు వివరించారు. ఈ వారోత్సవాల ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నందున, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించడం పాలక వర్గ సభ్యులు తెలియజేశారు.



# బటర్‌నాన్‌ను

## ఇంట్లోనే ఇలా తయారు చేసేసుకోండి..

బటర్‌నాన్ అంటే దాదాపు అందరూ ఇష్టపడతారు. రెస్టారెంట్‌కు వెళ్లిన ప్రతిసారీ దీనిని ఆర్డర్ చేసే వాళ్లు ప్రతి గ్యాంగ్‌లో ఒకరు తప్పకుండా ఉంటారు. ఎంతో టేస్టీగా ఉండే ఈ బటర్‌నాన్‌కు ఫుడ్ లవర్స్ ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. కేవలం బటర్‌నాన్ తినాలని వారంలో రెండు మూడు రోజుల పాటు రెస్టారెంట్‌లు, దాబాలకు వెళ్లే వారి సంఖ్య కూడా భారీగానే ఉంది. చాలా మంది ఇదంటే చచ్చేంత ప్రాణం ఉన్నా అనవసరంగా అంత ఖర్చు దేనికిలే అని తమ కోరికను చంపుకుని ఉంటారు. అలాంటి వారి కోసమే ఈ రెసిపీ. ఈ రెసిపీని ఫాలో అయితే ఇంట్లోనే బటర్‌నాన్‌ను సులువుగా తయారు చేసేసుకోవచ్చు. ఖర్చు కూడా పెద్దగా ఏమీ ఉండదు. కానీ ఇంట్లోనే తక్కువ ఖర్చు చేసుకోగలం కదా అని రోజూ తినడం అస్సలు మంచిది కాదు. కాబట్టి కాస్తంత మితంగా తింటే మంచిదని నిపుణులు కూడా చెప్తున్నారు. మరి ఇంట్లోనే బటర్‌నాన్‌ను ఎలా చేసుకోవాలో చూసేద్దామా..

**కావలసిన పదార్థాలు**



- మైదా ఒకటిన్నర కప్పు
- పెరుగు పావు కప్పు
- బేకింగ్ సోడా అర స్పూను
- ఉప్పు రుచికి సరిపడా
- పంచదార అర స్పూను
- నీరు తగినంత
- బట్టర్ పావు కప్పు

**తయారు చేసుకునే విధానం:**

1. బటర్ నాన్ రెసిపీలో పూర్తిగా మైదా పిండినే వాడతారు.
2. ఒక గిన్నెలో మైదాపిండి, పెరుగు, బేకింగ్ సోడా, ఉప్పు, పంచదార వేసి బాగా కలుపుకోవాలి.
3. తగినంత నీరు వేసి చపాతీ పిండికి లేదా పూరీ పిండికి ఎలా కలుపుకుంటారో అలా కలుపుకోవాలి.
4. దాన్ని నాలుగైదు ఉండల్లా చుట్టుకుని పైన కాస్త పిండి జల్లి ఒక ప్లేట్లో పెట్టాలి. పైన తడి గుడ్డను మూత పెట్టాలి.
5. ఒక పది నిమిషాలు అలా వదిలేయాలి. తర్వాత మైదా పిండిని చపాతీ పీటపై చల్లి ఈ మైదాపిండి ముద్దను పెట్టి చేతితోనే ఒత్తుకోవాలి.
6. దీన్ని ఒత్తడానికి రోలింగ్ పిన్ అవసరం లేదు.
7. కేవలం చేతితోనే కావాల్సిన సైజులో ఒత్తుకోవాలి.
8. కొంచెం నీళ్లను చేత్తో తడి చేసుకొని ఈ నాన్ పై రాయాలి.
9. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టి అది వేడెక్కాక ఈ నాన్ పైన వేసి కాల్చాలి. ఎలాంటి నూనె పెనంపై వేయాల్సిన అవసరం లేదు.
10. రెండు వైపులా కాల్చుకున్నాక తీసి పక్కన పెట్టాలి. ఇప్పుడు వెన్నను ఈ నాన్ పై బాగా పూయాలి.
11. అంతే టేస్టీ బటర్ నాన్ రెడీ అయినట్టే. దీన్ని మీరు పనీర్ బటర్ మసాలా కూరతో లేదా చికెన్ గ్రేవీతో తింటే రుచిగా ఉంటుంది.
12. ఒక్కసారి చేసుకుంటే తినాలనిపించేలా ఉంటుంది. కానీ మైదాపిండి ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి ఎక్కువసార్లు తినడం మంచి పద్ధతి కాదు.

బటర్ నాన్ మైదా పిండితోనే చేస్తారు. లేకపోతే అవి గోధుమపిండితో చేస్తే చపాతీ, రోటీల్లా అనిపిస్తాయి. మీరు బటర్ నాన్ తినాలి. అనుకుంటే తప్పకుండా మైదాపిండినే వాడాలి. మైదాపిండి వల్ల అనారోగ్య సమస్యలు అధికంగా వస్తాయి. కాబట్టి నెలకి ఒకసారి లేదా రెండుసార్లు మాత్రమే బటర్ నాన్ ప్రయత్నించండి. ఇక మధుమేహం ఉన్నవారు పూర్తిగా వాటిని తినకపోవడం మంచిది. సమస్యలు మరింతగా పెరిగిపోయే అవకాశం ఉంది





# పద్ధతిగా తింటే సున్నంతో కూడా భలే ప్రయోజనాలు

కిల్లీ.. దీనినే తాంబూళం అని కూడా అంటారు. దీనిని తినే వారి సంఖ్య ఇప్పుడు తగ్గిపోయింది కానీ.. వెనుకటి రోజుల్లో భోజనం తర్వాత దాదాపు ప్రతి ఒక్కరూ వీటిని తినే వారు. దీనిని ఒక ఔషధంలా భావించే వారు. కానీ ఇప్పుడు ఇందులో రకరకాల పదార్థాలు వేసి.. కిల్లీ వేసుకోవడం అంటే ఒక చెడ్డ అలవాటు అన్నట్లు మార్చేశారు. సాంప్రదాయ బద్ధమైన కిల్లీ అదేనండీ తాంబూళంలో చాలా మంది సున్నం వేసుకోవడానికి ఇష్టపడరు. పైగా సున్నం వేసుకుంటే పేగు పూత వస్తుందని కూడా అంటారు. అయితే నిపుణులు మాత్రం అవన్నీ అపోహలే అని చెప్తున్నారు. అసలు కిల్లీ తినడమే ఒక చెడ్డ అలవాటు అనుకుంటున్న ఈ రోజుల్లో అది చెడ్డ అలవాటు ఏమీ కాదని నిపుణులు వివరిస్తున్నారు. నిజానికి కిల్లీ తినడం వల్లే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని, కాకపోతే కిల్లీలో వేసుకునే సున్నం మితంగానే వినియోగించాలని చెప్తున్నారు. అధికమోతాదులో సున్నం వేసుకుంటే నోరు పొక్కడం, కడుపు మంట రావడం, మలబద్ధకం వంటి సమస్యలు కూడా వస్తాయని చెప్తున్నారు. నిజానికి సున్నం మితంగా తగిన మోతాదులో తింటే అజీర్తి, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యల నుంచి బయటపడొచ్చని అంటున్నారు. అంతేకాకుండా సున్నంను కేవలం పాన్‌లోనే వినియోగించరని.. దీనిని సరైన పద్ధతిలో వినియోగించాలే కానీ ఒక దివ్యౌషధంలా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెప్తున్న మాట. కాస్తంత మోతాదు పెరిగినా మంచేమో కానీ చెడు ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఆయుర్వేదంలో చెప్పిన విధంగా సున్నం వినియోగిస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని వివరిస్తున్నారు. మరి ఇంతకీ సున్నం ఎలా తినాలో తెలుసుకుందామా..

**సున్నం తినే విధానం:**

సున్నాన్ని పాన్ రూపంలో కాకుండా ఆరోగ్య ప్రయోజనాల కోసం తినే విధానం తెలుసుకోవడం ముఖ్యం. ప్రముఖ డైటీషియన్ శ్రేయా గోయల్ సున్నం తినే విధానాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఆమె ప్రకారం ప్రతిరోజు గోధుమ గింజ పరిమాణంలో సున్నాన్ని తినచ్చు. ఇందులో 500 మిల్లీగ్రాముల కాల్షియం ఉంటుంది. ఇలా ఒక వారం పాటు వరుసగా తిన్న తర్వాత మరో వారం పాటు విరామం తీసుకోండి. ఇలా వారం వదిలి వారం నాలుగు వారాల పాటు ఇలా తినచ్చు. వరుసగా మాత్రం తినకూడదు. అలాగే నాలుగు వారాల పాటు తిన్నాక, మరో ఆరు నెలల పాటు సున్నం తినకుండా ఉండాలి. సున్నాన్ని నేరుగా కాకుండా నీటితో, పెరుగు, పప్పులో కలిపి తినవచ్చు. ఇలా చేస్తే సున్నంతో కలిగే ప్రయోజనాలను పొందవచ్చు.

**సున్నంతో కలిగే లాభాలు**

ఎముకలు, దంతాలను బలపరుస్తుంది

సున్నంలో కాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఇది ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. ఎముకలను బలపరుస్తుంది. సున్నం వల్ల దంతాలు కూడా బలంగా తయారవుతాయి.

**జీర్ణక్రియకు సహాయపడుతుంది**

సున్నం తినడం వల్ల ఆహారం త్వరగా జీర్ణం అయి జీర్ణక్రియ మెరుగవుతుంది.

**జాయింట్ నొప్పుల నుండి ఉపశమనం**

కాల్షియం లోపం వల్ల జాయింట్ నొప్పులు వస్తున్నట్లయితే సున్నం మీకు చక్కటి పరిష్కారంగా పనిచేస్తుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది**

సున్నంలో అనేక ఖనిజాలు ఉంటాయి, ఇవి శరీరాన్ని అనేక రకాల ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి.

**పిల్లల ఎత్తు పెరగడానికి సహాయపడుతుంది**

పిల్లలకు గోధుమ ధాన్యం పరిమాణంలో సున్నాన్ని పెరుగు లేదా పప్పులో కలిపి ఇస్తే, పిల్లల ఎముకలు బలపడటమే కాకుండా, వారు ఎత్తు పెరగడానికి కూడా సహాయపడుతుంది.

**హృదయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది**

సున్నం కాల్షియంతో పాటు విటమిన్ సికి కూడా మంచి మూలం. ఇది హై బ్లడ్ ప్రెషర్ ప్రభావాన్ని తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. = హృదయ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

**బరువు తగ్గడంలో సహాయపడుతుంది**

అధికంగా తినడం వల్ల బరువు పెరుగుతున్నట్లయితే, ఒక గ్లాసు నీటిలో గోధుమ ధాన్యం కంటే చిన్న మొత్తంలో సున్నం వేసుకుని త్రాగండి. ఇందులోని సిట్రిక్ ఆమ్లం శరీర జీవక్రియను పెంచుతుంది. దీనివల్ల అదనపు కేలరీలు శరీరం నుండి బయటకు పోతాయి, కొవ్వు తక్కువగా నిల్వ చేయబడుతుంది.





# స్మార్ట్ ఫోన్‌ను రోజుకు ఎంత సేపు వాడాలో తెలుసా!

స్మార్ట్ ఫోన్.. ప్రస్తుతం ఎవరి చేతిలో చూసినా కనిపించే పరికరం. చిన్న చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి చేతిలో ఇది కనిస్తుంది. ప్రతి నలుగురిలో ఇద్దరు ఎప్పుడూ తమ ఫోన్‌ను చూస్తూనే ఉంటారని తాజా అధ్యయనాలు కూడా చెప్తున్నాయి. కొందరు తమ పనే ఫోన్‌తో ముడిపడి ఉంటుందని అంటే మరికొందరు ఎంటర్‌టైన్మెంట్ కోసం గంటల తరబడి ఫోన్లు చూసేస్తుంటారు. టెక్నాలజీ పెరగడం మంచిదే కావచ్చు. కానీ అది మనిషిని నాశనం చేసే వరకు పెరగడం ప్రమాదకరం. టెక్నాలజీని ఎంత తక్కువగా వాడితే మనం అంత ఆరోగ్యంగా ఉంటామనేది నిజం. స్మార్ట్ ఫోన్ ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని ఇప్పటికే ఎన్నో అధ్యయనాలు తేల్చి చెప్పాయి. రోజురోజుకు స్మార్ట్ వినియోగం పెరిగిపోతుండటం ప్రస్తుతం అత్యంత ఆందోలనకర అంశాల్లో ఒకటిగా మారిపోయింది. ఇటీవల తల్లిదండ్రి స్మార్ట్ ఫోన్ ఇవ్వడం లేదని, స్మార్ట్ వినియోగించడానికి ఒప్పుకోవడం లేదని ఇలా పలు ఇతర కారణాల వల్ల పిల్లలు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కూడా మన తెలుగు రాష్ట్రాల్లో వెలుగు చూశాయి. ఇలాంటి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నవే. వాటితో పాటుగా ఇటీవల పెరిగిపోయిన ఆన్‌లైన్ గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటివి పిల్లలను తప్పుదోవ పట్టించేలా కూడా ఉన్నాయి. వాటి ఉచ్చులో పడిపోయి పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా స్మార్ట్‌ఫోన్‌నే ప్రపంచంలా భావించేస్తున్నవారి సంఖ్య రోజురోజుకు వందల సంఖ్యలో పెరిగిపోతుందని నిపుణులు అంటున్నారు. మరి ఇంతకీ అసలు ఒకరోజులో స్మార్ట్ ఫోన్‌ను ఎంతసేపు చూడాలో తెలుసా? అంతకన్నా ఎక్కువ సేపు చూస్తే ఏమవుతుంది? అసలు స్మార్ట్ ఫోన్ తెచ్చే తంటాలు ఏంటి? ఒకసారి లుక్కేద్దామా..

అయితే కౌమారదశలో ఉన్నవారు (1019 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకులు) రోజుకు నాలుగు గంటల కంటే ఎక్కువ సమయం స్మార్ట్‌ఫోన్ ను ఉపయోగిస్తారు. అలాంటివారిలో ప్రతికూల మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల ఆలోచనలు, మాదక ద్రవ్యాల వినియోగం ఎక్కువగా ఉంటుందని ఒక అధ్యయనం పేర్కొంది.

కొరియాలో ఉన్న హన్యాంగ్ యూనివర్శిటీ మెడికల్ సెంటర్‌కు చెందిన బృందం 50,000 కంటే ఎక్కువ మంది కౌమారదశలో పాల్గొనేవారి డేటాను విశ్లేషించి, కౌమారదశలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం, వారి ఆరోగ్యం (శారీరక, మానసిక) మధ్య ఉన్న సంబంధాన్ని మరింత లోతుగా అధ్యయనం చేసింది.

పరిశోధన జరగడానికి ముందే, పెరుగుతున్న పిల్లలలో స్మార్ట్‌ఫోన్ వాడకం ఇటీవలి సంవత్సరాలలో బాగా పెరిగిందని తేలింది. ఈ వినియోగం వల్ల నిద్ర సమస్యలు, మానసిక రుగ్మతలు, మస్క్యులోస్కెలెటల్ డిజార్డర్స్ వంటి ప్రతికూల ఆరోగ్య సమస్యల ప్రమాదం ఎక్కువగా ఉందని అధ్యయనం పేర్కొంది.

**నిద్ర సమస్యలు:**

స్క్రీన్ సమయం కారణంగా ఒక వ్యక్తికి నిద్ర కరువు అవుతుంది. స్మార్ట్ ఫోన్ అతిగా వాడితే నిద్ర చక్రం దెబ్బతింటుంది. రాత్రి పడుకునేముందు స్మార్ట్ ఫోన్ చూస్తుంటే నిద్రరాదు. అందులో నుంచి వచ్చే బ్లూలైట్ మెలటోనిన్ ఉత్పత్తికి ఆటంకం కలిగించడంతో.. నిద్ర హార్మోన్ తక్కువైతే నిద్రరాదు. బ్లూలైట్ ఎక్కువసేపు కంటిపై పడితే నిద్రలేమి సమస్య వస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దానివల్ల అనేక ఆరోగ్య సమస్యల బారిన పడతారు.

**మానసిక రుగ్మతలు:**

స్మార్ట్ ఫోన్ ఎక్కువగా ఉపయోగించేవారు మానసిక రుగ్మతలతో బాధపడుతుంటారు. ఆందోళన, ఒత్తిడి, నిరాశ వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటారు.

**మస్క్యులోస్కెలెటల్ డిజార్డర్స్ (ఎంఎస్‌డీ):**

ఇది కండరాలు, స్నాయువులు, నరాలు, మృదులాస్థి, కీళ్ళు, వెన్నెముక డిస్క్‌ల రుగ్మత. వాటిని ఒకే స్థితిలో ఉంచినప్పుడు ఇది సక్రియం అవుతుంది. ఫోన్ అదేపనిగా చూస్తుంటే కళ్లు అలసిపోతాయి. కళ్లు పొడిబారడం, అస్పష్టమైన దృష్టి, తలనొప్పి, నిరసంలాంటి సమస్యలు వస్తాయి. ఫోన్ వాడకం ఎక్కువైతే దృష్టి సమస్యలు కూడా అధికమవుతాయి. రోజంతా ఫోన్ వాడితే.. మెడ, వెన్నెముక ఎక్కువసేపు వంగుతుంది. దీంతో దీర్ఘకాలిక వెన్నెముక సమస్యలు వస్తాయని అధ్యయనం పేర్కొంది.



# సాయి పల్లవికి షాకిచ్చిన 'రామాయణ' టీమ్!


నితేష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ'. ఈ సినిమాలో సీతగా నటిస్తున్న సాయి పల్లవి గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆమె పోషిస్తున్న పాత్రకు మేకర్స్ డబ్బింగ్ ఆర్టిస్ట్‌ను వినియోగించాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల సాయి పల్లవి హిందీలో నటించిన ఫస్ట్ సినిమా 'ఏక్ దిన్'. ఇందులో జునైద్ ఖాన్ సరసన నటించగా.. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఈ సినిమాలో సాయి పల్లవి హిందీ డైలాగ్ డెలివరీ, ఆమె స్లాంగ్ పై నెటిజన్ల నుంచి కొంత విమర్శలు వచ్చాయి.పౌరాణిక చిత్రమైన 'రామాయణ'లో భాష చాలా స్వచ్ఛంగా, స్పష్టంగా ఉండాలి. కాబట్టి సాయి పల్లవి హిందీ యాస సీత పాత్రలోని దైవత్వానికి లేదా గాంభీర్యానికి సరిపోకపోవచ్చని కొందరు అభిప్రాయ పడుతున్నారట. సాయి పల్లవి తన పాత్రలకు తానే డబ్బింగ్ చెప్పుకోవడానికి ఇష్టపడుతుంది. అయితే, సినిమా నాణ్యత, పాత్ర స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని మేకర్స్ తీసుకున్న ఈ నిర్ణయం సాయి పల్లవి షాక్ అనే చెప్పాలి. అందుకు సాయి పల్లవి కూడా ఒప్పుకున్నట్లు టాక్. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ భారీ చిత్రం మొదటి భాగం 2026 దీపావళి కానుకగా విడుదల కానుంది. రణబీర్ కపూర్ రాముడు, సాయి పల్లవి సీత, యష్ రావణుడు, సన్నీ డియోల్ హనుమంతుడు వంటి పాత్రలో కనిపించబోతున్నారు.



# దర్శకుడుగా హీరో రామ్..

తెలుగు సినీ పరిశ్రమలో 'ఎనర్జిటిక్ స్టార్'గా తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న హీరో రామ్ పోతినేని (RAPO). 'దేవదాసు' హీరోగా మొదలైన రామ్ ప్రయాణం.. తనదైన నటనతో, చలాకీతనంతో, అదిరిపోయే డాన్సులతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకునేలా చేసింది. అయితే, ఇన్నాళ్లూ తన నటనతో కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్.. ఇప్పుడు తన కెరీర్‌లో ఓ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఇకపై కేవలం హీరో మాత్రమే కాదు.. దర్శకుడు కూడా! రామ్ హీరోగా నటిస్తున్న 23వ చిత్రం (#RAPO23)కి సంబంధించి అభిమానులకు ఒక పవర్‌ఫుల్ అప్‌డేట్ సిద్ధమైంది. ఈ సినిమాతో ఆయన దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కెమెరా ముందు యాక్షన్ చేస్తూనే, కెమెరా వెనుక 'యాక్షన్' చెప్పబోతున్నారు. రామ్ సినీ ప్రయాణంలో ఇదొక పవర్‌ఫుల్ టర్న్ అని చెప్పాలి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన రేపు (మే 15వ తేదీ) ఉదయం 10:08 గంటలకు అట్టహాసంగా వెలువడనుంది. రామ్ స్వయంగా తానొక దర్శకుడిగా మారాను అనే విషయాన్ని రేపు అధికారికంగా ప్రకటించనున్నారు.

రామ్ ఉన్నట్టుండి మెగాఫోన్ పట్టుకున్నారు? అయితే వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. వాస్తవానికి రామ్ గతంలో తన కోసం తానే ఓ పవర్‌ఫుల్ స్టోరీని రాసుకున్నారు. కథ అయితే సిద్ధమైంది కానీ, దాన్ని తాను ఊహించిన విధంగా, ఆ కథలోని ఎమోషన్‌ను పర్ఫెక్ట్‌గా స్క్రీన్‌పై ప్రెజెంట్ చేయగల దర్శకుడి కోసం ఆయన చాలా కాలం పాటు వేట సాగించారు. పలువురు దర్శకులను సంప్రదించినప్పటికీ, తన కథను తాను అనుకున్న స్థాయిలో డీల్ చేయగల దర్శకుడు ఆయనకు దొరకలేదట. తన కథలోని ఆత్మను పూర్తిగా అర్థం చేసుకున్న వ్యక్తి తానే కావడంతో, చివరకు ఆ బాధ్యతను తన భుజాలపైనే వేసుకోవాలని రామ్ గట్టి నిర్ణయించుకున్నారు.






# మిషన్ మంగళ్ దర్శకుడితో?


'కర' సినిమాతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు తమిళ హీరో ధనుష్. దర్శకుడిగా, నటుడిగా భిన్నమైన కథలతో ప్రయాణిస్తున్న ఈయన ఖాతాలో ప్రస్తుతం రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న ఓ చిత్రం ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ధనుష్ జాబితాలో మరో చిత్రం చేరినట్లు తెలుస్తోంది. 'మిషన్ మంగళ్' చిత్రంతో మంచి హిట్‌ను అందుకున్న బాలీవుడ్ దర్శకుడు జగన్ శక్తితో ఆయన ఓ సినిమా కోసం చేతులు కలిపినట్లు సమాచారం. ప్రస్తుతం జగన్ శక్తి.. అజయ్ దేవగన్ నటిస్తున్న 'రేంజర్' సినిమాతో బిజీగా ఉన్నారని, ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యాక దీనికి సంబంధించిన స్క్రిప్ట్ పనుల్ని మొదలు పెట్టనున్నారని ధనుష్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఇందులో నిజమెంత ఉందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

టాలీవుడ్ యంగ్ అండ్ సెన్సేషనల్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం వరుస అవకాశాలతో ఇండస్ట్రీలో క్రేజీ బ్యూటీగా మారింది. 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ భామ, ఆ సినిమా ఫలితంతో సంబంధం లేకుండా తన గ్లామర్, నటనతో దర్శకనిర్మాతలను మెస్మరైజ్ చేస్తోంది. విజయ్ దేవరకొండ, రామ్ పోతినేని, దుల్కర్ సల్మాన్ వంటి స్టార్ హీరోలతో నటించిన సరైన హిట్ అందుకోలేకపోయింది. అయినప్పటికీ వరుస అవకాశాలు దక్కించుకుంటోంది.ప్రస్తుతం స్టార్ హీరో శివకార్తికేయన్ సరసన 'సెయాన్' చిత్రంతో తమిళ ఇండస్ట్రీలోకి కూడా అడుగుపెడుతోంది. అలాగే అక్కినేని అఖిల్ సరసన 'లెనిన్' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం వేగంగా జరుగుతోంది. దీనిని జూన్ 26న విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న భాగ్యశ్రీ తాను పని చేసిన ప్రతి హీరో నుంచి ఏదో ఒక విషయాన్ని నేర్చుకున్నానని తెలిపింది. "మాస్ మహారాజా నుంచి సహనం, షూటింగ్ సెట్స్‌లో ఆయన చూపించే అంతులేని ఎనర్జీని చూసి ఆశ్చర్యపోయా. ఇక విజయ్ దేవరకొండకు సినిమాపై ఉన్న ప్యాషన్, ప్రతి సీన్‌ను పర్ఫెక్ట్‌గా చేయాలనే ఆయన తపన నను ఎంతగానో ప్రభావితం చేశాయి. రామ్ కేవలం స్టార్ హీరో మాత్రమే కాదు, అద్భుతమైన డ్యాన్సర్. ప్రతి షాట్ కోసం ఆయన పెట్టే డెడికేషన్ నుంచి చాలా విషయాలు గ్రహించాను. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఇక దుల్కర్ సల్మాన్ ఇప్పటికే సీనియర్ నటుడైనప్పటికీ, ప్రతి సన్నివేశాన్ని ఒక కొత్త నటుడిలా ఆసక్తిగా గమనించడం ఆయన గొప్పతనం" అని ప్రశంసలు కురిపించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## ఆయన నుంచి ఎన్నో విషయా నేర్చుకోవచ్చు..



# ఇష్టపడకపోతే.. మరింత కష్టపడతా!



నాతో మంచి స్నేహం కుదరాలంటే కనీసం నాలుగుసార్లు అయినా కలిసి మాట్లాడాలి అంటోంది బాలీవుడ్ హీరోయిన్ సారా అలీఖాన్. అంతేకాదు కెరీర్‌లో నెగిటివిటీని పట్టించుకోకుండా.. ప్రేక్షకులు ఆదరించే వరకు కష్టపడతానని చెప్పుకొచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సారా మాట్లాడుతూ.. "మీరు నన్ను రెండు, మూడు సార్లు కలిసినప్పుడు నేను మీకు నచ్చకపోవచ్చు. కానీ, మనం నాలుగోసారి కలిస్తే కచ్చితంగా స్నేహితులవుతాం. నా జీవితంలోనే ఒక ఫిల్టర్ సిస్టమ్ ఉన్నట్లుంది. అందుకేనేమో నేను మీకు నచ్చాలంటే నాలుగుసార్లు అయినా కలవాలి. నా కెరీర్ ప్రారంభంలోనే ప్రేక్షకుల నుంచి చాలా ప్రేమ లభించింది. 'కేదార్‌నాథ్', 'సింబా' విడుదల తర్వాత రాత్రికి రాత్రే ఫేమ్ సాధించడంతో తొలినాళ్లలోనే అమ్మ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. నేను కూడా నిజాయతీతో పనిచేస్తే ప్రేక్షకులు ప్రేమతో ఆదరిస్తారని అప్పుడే తెలుసుకున్నా. అంతా మంచే జరగాలని ఆశిస్తూ ముందుకు సాగిపోవాలనుకున్నా. నెగిటివిటీని అస్సలు పట్టించుకోను. నా దృష్టిలో ఎలాంటి నెగిటివిటీ ఎదురైనా చివరికి పనే మాట్లాడుతుందని భావిస్తాను. ఒకవేళ ప్రేక్షకులు నన్ను ఇష్టపడకపోతే మరింత కష్టపడతాన"ని అంది. 'పతి పత్నీ ఔర్ వోదో' చిత్రంతో ఈ నెల 15 నుంచి థియేటర్లలో సందడి చేయనుంది సారా.

## శర్వానంద్‌శ్రీనువైట్ల సినిమాలో

# హీరోయిన్‌గా క్రేజీ బ్యూటీ!

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల 'బైకర్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఇప్పుడు 'భోగి' అనే యాక్షన్ డ్రామాతో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలోనే శర్వానంద్ తన తదుపరి ప్రాజెక్టును టాలీవుడ్ సీనియర్ దర్శకుడు శ్రీనువైట్లతో ఖరారు చేయడం విశేషం. శ్రీనువైట్ల మార్క్ కామెడీకి, విభిన్నమైన టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌ను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తోంది. వినోదానికి సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తోడైతే ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలుగుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జులై 2026 నుంచి షూటింగ్ ప్రారంభించి, వచ్చే సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో శర్వానంద్ సరసన నటించే హీరోయిన్ విషయంలో గత కొన్ని రోజులుగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొదట పూజా హెగ్డే, మమిత బైజు వంటి స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం.. మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని ఖరారు చేసినట్లు టాలీవుడ్ టాక్. ఇటీవల 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మానస, ఇప్పుడు శర్వానంద్ లాంటి స్టార్ పక్కన నటించే అవకాశం దక్కించుకుంది. శర్వానంద్‌మానస జోడీ వెండితెరపై ఒక ఫ్రెష్ ఫీల్‌ను ఇస్తుందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. శ్రీనువైట్ల తనదైన శైలిలో కామెడీని పండిస్తూనే, సైన్స్ ఫిక్షన్ లాంటి కొత్త జోనర్‌ను టచ్ చేస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ తుది దశలో ఉందని సమాచారం.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.